
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5




కృష్ణా జిల్లా వార్తలు

శుక్రవారం 6 జూన్ 2025



అలా మొదలైంది

మసులా బీచ్ ఫెస్టివల్ ప్రారంభం



- మంగినపూడి సముద్రతీరంలో సందడి
- ఆకట్టుకున్న పారాగ్లైడింగ్, స్పీడ్ బోటింగ్, హెలీరైడ్
- మొదటిరోజు తరలివచ్చిన పర్యాటకులు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఫుడ్ స్టాల్స్

అమరావతి స్థూపాన్ని తలపించేలా గ్రాండ్ ఎంట్రన్స్



బీచ్ ఫెస్టివల్‌కు తరలివస్తున్న పర్యాటకులు

అల్లంతదూరాన ఎగసి పడుతున్న అలలు.. ఆకాశాన ఎగిరిపోతున్న ప్యారామోటార్ అందాలు.. తీరాన జన కేరింతలు.. మచిలీపట్నంలోని మంగినపూడి తీరంలో మసులా బీచ్ ఫెస్టివల్ గురువారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉడుకు వేడిగాలులను కాసేపు పక్కకునెట్టి పర్యాటకులు తీరంలో చల్లటి వాతావరణాన్ని ఆస్వాదించారు. సముద్ర జీవుల బొమ్మలు, అమరావతి ఐకానిక్ టవర్, వంద అడుగుల ఎత్తులో ఏర్పాటుచేసిన జాతీయ జెండా, బోట్ల రైడింగ్.. అబ్బో ఒక్కటేమిటి మనసును కట్టిపడేసేలా మసులా బీచ్ ఫెస్టివల్ మైమరపింపజేసింది. సీ ఫుడ్ స్టాల్స్‌తో పాటు వస్త్ర, కలంకారీ, కొండపల్లి కొయ్యబొమ్మలు, పిల్లల ఆట వస్తువులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారుల ఆటల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నాలుగురోజుల పాటు జరిగే ఈ ఫెస్టివల్‌ను మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్ తదితరులు జెండా ఎగురవేసి ప్రారంభించారు. - మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి



ఉత్కంఠరేపిన కబడ్డీ పోటీలు 6



మంగినపూడి సముద్రతీరంలో స్నానాల సందడి



జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం ఉత్సవాలను ప్రారంభించి సెల్యూట్ చేస్తున్న మంత్రులు కొల్లు, దుర్గేష్

నోయిడా టు బెజవాడ

గిఫ్టు ప్యాక్‌లో ఎండీఎంఏ డ్రగ్ సరఫరా

- హైదరాబాద్ చిరునామాలకు కొరియర్
- అక్కడి నుంచి విజయవాడకు..
- ఏడాది నుంచి సాగుతున్న వ్యవహారం
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు



నిందితుల వివరాలు తెలియజేస్తున్న డీసీపీ సరిత, సెంట్రల్ ఏసీపీ దామోదర్ తదితరులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇప్పటి వరకు వివిధ రకాలుగా మాదకద్రవ్యాలను చేతులు మార్చుకున్న డ్రగ్స్ మాఫియా తాజాగా గిఫ్ట్ ఆర్టికల్స్‌పై దృష్టిపెట్టింది. ఒక బాక్స్‌లో మాదకద్రవ్యాలను పెట్టి, గిఫ్ట్‌బాక్స్‌లా పార్శిల్ చేసి గుట్టుచప్పుడు కాకుండా సరఫరా చేస్తున్నారు. టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టుబడిన ముఠాను విచారణ చేయగా, ఈ గిఫ్ట్ కోణం వెలుగులోకి వచ్చింది. ఢిల్లీలోని నోయిడా నుంచి ఎండీఎంఏ డ్రగ్‌ను కొరియర్ ద్వారా రప్పించుకుంటున్నారని తెలుసుకున్నారు. పోలీసులకు చిక్కిన మిగతా 6లో..

ఇదేం తీరు?

మల్లవల్లిలో ఏపీఐఐసీ అధికారుల ద్వంద్వనీతి

పనులు మొదలుపెట్టని సంస్థల భూ కేటాయింపుల పునరుద్ధరణ

- పనులు మొదలుపెట్టిన వారికి సమయం ఇవ్వకుండా నిర్లక్ష్యం
- వైసీపీ హయాంలో నానా ఇబ్బందులు పడిన పారిశ్రామికవేత్తలు
- పరిహారం ఇవ్వలేదని నాడు దారులు కూడా మూసేసిన రైతులు
- ప్రభుత్వం మారడంతో తాజాగా పనుల ప్రారంభించిన సంస్థలు
- ఈవోటీ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న ఏపీఐఐసీ

మల్లవల్లిలో పారిశ్రామికవేత్తల విషయంలో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఐఐసీ) అధికారులు ద్వంద్వ విధానాన్ని అనుసరిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం.. వైసీపీ హయాంలో యూనిట్లకు రద్దు చేసిన భూ కేటాయింపులనే పునరుద్ధరిస్తున్నారు. కానీ, గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో భూ కేటాయింపులు పొంది, పనులు చేపడుతున్న సంస్థల విషయంలో మాత్రం ఏపీఐఐసీ అధికారుల తీరు సరిగ్గా లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్ (ఈవోటీ) ఇవ్వటంపై వివాదాలు రేగుతున్నాయి.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో మల్లవల్లి భూముల వ్యవహారాలు వివాదాస్పదమయ్యాయి. టీడీపీ ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమం కావటంతో మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో భూ సంబంధిత సమస్యలను నాటి వైసీపీ ప్రభుత్వం పరిష్కరించలేదు. దీంతో తమకు పరిహారం అందలేదన్న పేరుతో రైతులు పనులను జరగనీయలేదు. ఫలితంగా అప్పటికే పనులు మొదలుపెట్టిన పారిశ్రామికవేత్తలు నానా ఇబ్బందులు పడ్డారు. పారిశ్రామికవాడలోకి వెళ్లే దారులను సైతం రైతులు మూసేశారు. పలు రోడ్లకు గండ్లు కొట్టారు. రైతులు చేసిన ప్రయత్నాలను అప్పట్లో పలువురు పారిశ్రామికవేత్తలు అడ్డుకున్నారు. ఇది మంచి పద్ధతి కాదంటూ అడ్డుగోడలను తొలగించి పనులు చేపట్టే ప్రయత్నం చేశారు. దీంతో పలువురు భూ బాధితులు పారిశ్రామికవేత్తలపై పోలీసు స్టేషన్లలో కేసులు పెట్టే వరకు వ్యవహారం వెళ్లింది. కొందరు పారిశ్రామికవేత్తలు ఎస్సీ, ఎస్టీల కేసులు కూడా ఎదుర్కొన్నారు. మొదలుపెట్టిన పనులు పూర్తి చేయలేక ఐదేళ్ల పాటు నానా ఇబ్బందులు పడిన పారిశ్రామికవేత్తల విషయంలో ఏపీఐఐసీ అధికారులు మరోలా ప్రవర్తిస్తున్నారు.

ఈవోటీ తాత్సారమెందుకు?

ఉదాహరణకు రత్నం మోటార్స్ లిమిటెడ్ మల్లవల్లిలో వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్ల తయారీ యూనిట్ల ఏర్పాటుకు ముందుకొచ్చింది. రైతుల అవసరాలు చెబితే, పరిశోధనలు చేసి ఆ అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో అధునాతనమైన యంత్రాలను తయారు చేసి ఇస్తుంది. అతి తక్కువ ఖర్చుతో వ్యవసాయ పనిముట్లను సిద్ధం చేస్తుంది. ఈ సంస్థ తాము పొందిన స్థలంలో నాలుగు యూనిట్లను మిగతా 6లో..

తప్పు ఎవరిది?

వైసీపీ హయాంలో రైతులతో నెలకొన్న సమస్యలను పరిష్కరించటంలో ఏపీఐఐసీ అధికారులు సరిగ్గా వ్యవహరించలేదన్న విమర్శలు ఉన్నాయి. నాడు రైతులు కోర్టులను ఆశ్రయించగా, వారితో సంప్రదింపులు జరిపి సమస్యలను పరిష్కరించుకోమని న్యాయస్థానాలు సూచించినా కూడా అధికారులు అంతులేని నిర్లక్ష్యాన్ని చూపించారు. ఫలితంగా పారిశ్రామికవేత్తలు నానా ఇబ్బందులు పడ్డారు.

నందనవనం



ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్‌లో గురువారం మంత్రి రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ తదితరులు మొక్కలు నాటారు. మంత్రి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

8

ప్రమాణస్వీకారం



కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి నెట్టెం రఘురాం గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని బ్యాంకు కార్యాలయంలో ఆయన్ను ఎంపీ కేశినేని శివనాథ్ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సభలో మంత్రి కొల్లు రవీంద్ర సహా పలువురు ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఆ నగదు ఎక్కడ?

బంగారం శ్రీను ఇంట్లో పోలీసు సోదాలు

- బంగారం, వెండి తప్ప కనిపించని డబ్బు
- పోలీసుల విచారణలో నోరు మెదపని నిందితుడు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : బంగారం చీటీలు నిర్వహించి ఒక్కొక్కరి నుంచి లక్షల రూపాయలు వసూలు చేశాడు. నగదు చీటీల నిర్వహణలోనూ ఇదే చేశాడు. ఇప్పుడు ఆ డబ్బంతా ఎక్కడుందో తెలియట్లేదు. పోలీసులకూ చెప్పట్లేదు. ఇదీ బంగారం చీటీలు నిర్వహించి వందల మందికి కోట్ల రూపాయలు టోకరా వేసిన ముచ్చెర్ల శ్రీనివాసరావు వ్యవహారం. హైదరాబాద్‌లో తలదాచుకున్న శ్రీనివాసరావును అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అతడ్ని నగరానికి తీసుకొచ్చి పోలీసు స్టేషన్‌లో గంటల తరబడి విచారణ చేశారు. పోలీసులు అడిగిన ఒక్క ప్రశ్నకు కూడా శ్రీనివాసరావు సమాధానం మిగతా 6లో..

వైద్యశాఖలో అవినీతి రోగం

డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో గాడితప్పిన పాలన

- ప్రతి పనికీ రేటు నిర్ణయించి భారీగా వసూళ్లు
- ఎలాంటి ఉత్తర్వులు లేకుండా 15 మందికి డిప్యుటేషన్
- వసూళ్లలో వారిదే ప్రధాన పాత్ర
- కార్యాలయంలో కీలక అధికారి కనుసన్నల్లోనే పనులు
- కలెక్టర్ మందలించినా మారని తీరు

జిల్లా వైద్యఆరోగ్య శాఖ (డీఎంఅండ్‌హెచ్‌వో) కార్యాలయంలో పాలన గాడి తప్పిందా..? ప్రతి పనికీ రేటు నిర్ణయించి నగదు వసూలు చేస్తున్నారా..? కార్యాలయంలో కోటరీగా ఏర్పడిన ఉద్యోగులే ఆ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల నుంచి నగదు వసూళ్లకు పాల్పడుతున్నారా..? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. ఈ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల అవినీతి, అక్రమాలపై కలెక్టర్‌కు ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయి. ఈ కార్యాలయంలో పరిపాలనను గాడిలో పెట్టాలని కలెక్టర్ పలుమార్లు చేసిన సూచనలను సైతం అధికారులు పక్కనపెట్టి తమదైన శైలిలో వ్యవహారాలు నడుపుతున్నారనే విమర్శలూ లేకపోలేదు.



మచిలీపట్నంలోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : సచివాలయాల్లో పనిచేసే ఏఎన్ఎంలకు పదోన్నతులు ఇచ్చినట్టే ఇచ్చి, 40 రోజుల నుంచి ఉత్తర్వులు జారీ చేయలేదు. దీంతో డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వద్ద గత మంగళవారం రాత్రి 11 గంటల వరకు ఏఎన్ఎంలు ఆందోళనకు దిగారు. ఈ విషయంపై ఏఎన్ఎంలు గతంలోనే కలెక్టర్ బాలాజీని కలిసి విజ్ఞప్తి చేసుకున్నారు. స్పందించిన కలెక్టర్ వివిధ శాఖల జిల్లా అధికారులతో కమిటీని నియమించి, సాధ్యాసాధ్యాలను పరిగణనలోకి తీసుకుని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మిగతా 6లో..


రోహిణి సెగలతో చిర్రెత్తిపోయిన నగర ప్రజలకు సాగర తీరంలో ఏర్పాటు చేసిన 'మసులా ఫెస్ట్' సాంత్వన చేకూర్చింది. బీచ్ ఫెస్టివల్ తొలిరోజునే సందర్శకుల తాకిడితో మచిలీపట్నం మంగినపూడి కొత్త కళ సంతరించుకుంది. బీచ్‌లో స్టాల్స్, సముద్ర జీవుల బొమ్మలతో పిల్లల అల్లరి మధ్య తల్లిదండ్రులు అలసటను మరిచిపోయారు. యువత కేరింతలతో సాగర తీరం మురిసిపోయింది.



విద్యుత్ కాంతుల్లో అమరావతి గేట్ వే





బీచ్ ఫెస్టివల్‌లో సందర్శకుల ఆనందోత్సాహం



మైమరపించేలా.. మసులా ఫెస్ట్

- సందర్శకులతో మంగినపూడి బీచ్‌కి కొత్త కళ
- ఆకట్టుకుంటున్న స్టాల్స్.. కనువిందు చేస్తున్న ఆకృతులు
- నగరానికి చేరుకున్న 4వేలకు పైగా క్రీడాకారులు
- తొలిరోజు ఆకట్టుకున్న పారాగ్లైడింగ్, స్పీడ్ బోటింగ్, హెలిరైడ్





విజయవాడ/మచిలీపట్నం టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో ఏర్పాటు చేసిన అందమైన ఆకృతులు, బొమ్మలు, అమరావతి ఐకానిక్ టవర్, వంద అడుగుల జాతీయ జెండా, బోట్ల రైడింగ్‌తో సాగరతీరం ఆహ్లాదకరంగా మారింది. మొదటి రోజు బీచ్‌లో పర్యాటకుల సందడి మొదలైంది. సుమారు ఆరేళ్ల తర్వాత బీచ్ ఫెస్టివల్ ఏర్పాటుతో పర్యాటకులతో మంగినపూడి కళకళలాడింది. ఈ ప్రాంతం పర్యాటకంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న స్టాల్స్

మంగినపూడి బీచ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వస్త్ర, కలంకారీ, కొండపల్లి కొయ్యబొమ్మలు, పిల్లలకు ఆటవస్తువులకు సంబంధించి పలు స్టాల్స్‌తో పాటు సీ ఫుడ్స్ స్టాల్స్ పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. సాగర తీరానికి కొత్త అందాలు తెచ్చిపెట్టాయి.

తొలిరోజు సందర్శకుల తాకిడి

ఇటీవల పర్యాటకుల తాకిడి లేకపోవడంతో వెలవెలబోయిన మంగినపూడి బీచ్ 'మసులా ఫెస్ట్' సందర్శకులతో కళకళలాడింది. గురువారం నుంచి ఫెస్టివల్ మొదలవడంతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటకులు తరలివస్తున్నారు. ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన ఎనభై అడుగుల అమరావతి ఐకానిక్ టవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

22 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు

సుమారు 4 వేల మంది క్రీడాకారులు 22 రాష్ట్రాల నుంచి ఇప్పటికే రాష్ట్రానికి చేరుకున్నారు. మరి కొంతమంది త్వరలో రానున్నారు. బీచ్‌క్రీడలను చూసేందుకు పర్యాటకుల తాకిడి గురువారం నుంచే మొదలైంది.



ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లను చేసింది. 2018లో మొదటిసారి బీచ్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన టీడీపీ ప్రభుత్వం నాడు స్టాల్స్, గుర్రపు స్వారీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ముగించినా.. ఈసారి మరింత పురోగతి సాధించేలా ఆసక్తికరమైన క్రీడలను ఫెస్టివల్‌లో భాగం చేసింది. బీచ్ వాలీబాల్, కబడ్డీ, కనోయింగ్, బోట్ రైడ్ లాంటి క్రీడలతో పర్యాటకులను అలరించడానికి సిద్ధమైంది. గురువారం హెలికాప్టర్ రైడింగ్, పారా గ్లైడింగ్, స్పీడ్ బోటింగ్‌ను నిర్వహించగా.. కార్యక్రమాలు ముగిసేవరకూ పర్యాటకులు కదలకుండా చూస్తూ మైమరిచిపోయారు.

చిలకలపూడి బీచ్‌లో..

మసులా ఫెస్టివల్ నేపథ్యంలో మంగినపూడితో పాటు కూతవేటు దూరంలో ఉన్న చిలకలపూడి బీచ్‌కు సందర్శకులు పోటెత్తారు. దీంతో ఎప్పటి నుంచో కళావిహీనంగా ఉన్న చిలకలపూడి బీచ్‌కు మసులా పుణ్యమా అని కళకళలాడింది.



జాతీయ స్థాయిలో గుర్తింపు తెస్తాం

- మంత్రులు కొల్లు రవీంద్ర, దుర్గేష్

మచిలీపట్నం టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లాలోని మంగినపూడి బీచ్‌ను జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకుని వచ్చేలా, పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే మసులా బీచ్ ఫెస్టివల్‌ను అంగరంగ వైభవంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి,


బీచ్ ఫెస్టివల్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్


కందుల దుర్గేష్, మంత్రి రవీంద్రలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. 100 అడుగుల జాతీయ పతాకను మంత్రులు దుర్గేష్ ఆవిష్కరించారు. తమిళనాడు, రాజస్థాన్ కబడ్డీ జట్ల పోటీలను మంత్రి రవీంద్ర ప్రారంభించారు. గేట్‌వే ఆఫ్ అమరావతి ముఖ ద్వారాన్ని మంత్రులు ప్రారంభించారు. వివిధ సముద్రపు జీవుల ఆకృతులను తిలకించారు. కయాకింగ్, కనోయింగ్, జలక్రీడల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, కేంద్ర పర్యాటక శాఖా మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి కావలసిన నిధులు మంజూరు చేయమని అడిగామన్నారు. వివిధ ప్రాజెక్టుల డీపీఆర్‌లను రూపొందించామన్నారు. 2026 డిసెంబర్ నాటికి బందరు పోర్టు నిర్మాణం పూర్తవుతుందని, పోర్టు పాటు మంగినపూడి బీచ్ అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ మాట్లాడుతూ, మంగినపూడి బీచ్‌ను అభివృద్ధి చేసేందుకు హోటల్స్, రిసార్ట్స్‌ను ఆహ్వానిస్తున్నామన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, బందరు పోర్టు అభివృద్ధితో పాటు బీచ్ అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, దేశంలో రెండో మునిసిపాలిటీ అయిన మచిలీపట్నంకు గత ప్రాభవాన్ని పునరుద్ధరించేందుకు మంత్రి రవీంద్ర కృషి చేస్తున్నారన్నారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ, కూచిపూడి నాట్యానికి మరింత వన్నె తెచ్చేలా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. తానా మాజీ ఛైర్మన్ కోన జయరామ్, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఆంధ్రకబడ్డీ అసోసియేషన్ అధ్యక్షురాలు ప్రభావతి, టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, కుంచే నాని, మోటమర్రి బాబాప్రసాద్, కాగిత వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం యువగళం కార్యక్రమంలో 1250 మంది విద్యార్థులు వేసిన చిత్రపటానికి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును మంత్రి దుర్గేష్, కలెక్టర్ బాలాజీ ఆవిష్కరించారు. ఎస్పీ ఆర్ గంగాధరరావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కూచిపూడి నాట్యప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


మంత్రులు వాసంశెట్టి సుభాష్, అనగాని సత్యప్రసాద్‌లకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

దుర్గమ్మ సేవలో రాష్ట్ర మంత్రులు

ఇంద్రకీలాద్రి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను గురువారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లు దర్శించుకున్నారు. వీరికి ఈవో వీకే శీనానాయక్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనంకల్పించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం, లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

కనకదుర్గమ్మకు రూ.4.11 కోట్ల ఆదాయం



ఇంద్రకీలాద్రి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మవారికి హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఈవో శీనానాయక్ పర్యవేక్షణలో జరిగిన లెక్కింపు కార్యక్రమంలో ఏఈవోలు, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, దేవదాయ శాఖ సిబ్బంది, వన్‌టౌన్ పోలీసులు, ఎస్‌పిఎఫ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు. 22 రోజులకు గాను రూ.4,11,96,190లు నగదు రూపంలో, 394 గ్రాముల బంగారం, 8కిలోల10 గ్రాముల వెండి సమకూరాయి.

అన్నదాన సేవ పూర్వజన్మ సుకృతం : ఢిల్లీరావు

వన్‌టౌన్: అన్నదాన సేవ పూర్వజన్మ సుకృతమని, భగవంతుని సేవామార్గానికి అన్నదానం అత్యుత్తమమని వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా, తాడేపల్లిలోని విజయవాడ క్లబ్ రోడ్డులో గల ఆర్ఎల్ గౌతమి రివర్ బ్రీజ్ అపార్టుమెంట్ నివాసితులు ఎన్.ఎస్.వి.ప్రసాద్, నన్నపనేని రేవతి దంపతులు, అక్షయితి శ్రీహిత, నన్నపనేని కుటుంబసభ్యుల సహకారంతో తిరుమలలో నిత్యాన్నదాన పథకానికి పది మెట్రిక్ టన్నుల కూరగాయల వాహనానికి గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

ఇదేం తీరు?

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేస్తోంది. ఒకదాని పనులు పూర్తయ్యాయి. రెండు, మూడు, నాలుగు యూనిట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీఐఐసీ, రైతుల మధ్య నెలకొన్న సమస్య కారణంగా ఐదేళ్ల పాటు ఈ పనులు ముందుకు తీసుకెళ్లలేదు. ఇప్పుడు ప్రభుత్వం మారటంతో ఆ సంస్థ పనులు కూడా ప్రారంభించింది. పనులు ప్రారంభించే సంస్థకు ఏపీఐఐసీ ఈవోటీ ఇవ్వాలి. అలా ఇస్తేనే నిర్ణీత సమయంలోపు ఆ సంస్థ పనిచేయగలదు. ఇలాంటి వాటికి ఈవోటీలు ఇవ్వటం వల్ల ఇప్పటికే మొదలైన పనులను త్వరగా పూర్తిచేస్తాయి. కానీ, అసలు పనులే ప్రారంభించని సంస్థల భూ కేటాయింపులను పునరుద్ధరించి, పనులు చేస్తున్న సంస్థలకు సమయం ఎందుకు ఇవ్వట్లేదో అర్థం కావట్లేదు. పనులు మొదలుపెట్టిన సంస్థలకు కూడా తగిన అవకాశాలు కల్పిస్తే అవి కూడా త్వరగా ఉత్పాదకతను ప్రారంభిస్తాయి. ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తాయి. కాబట్టి ఈ అంశాలపై ఏపీఐఐసీ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

మొక్కలతోనే మనుగడ సాధ్యం

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ఇబ్రహీంపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మానవుల మనుగడకు మొక్కలే ఆధారం అని.. వాటిని నాటడంతో పాటు పరిరక్షించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొత్తూరు తాడేపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన


ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే వసంత తదితరులు

ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడతామని నేతలు, అధికారులు ప్రతిజ్ఞ చేసి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు నేటినుంచి ఆగస్టు 15వరకు ప్రతి ఒక్కరు తమ మాతృమూర్తి పేరిట మొక్కనాటి దానిని పరిరక్షించాలన్నారు. ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ, మొక్కల పెంపకంపై ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ జి.లక్ష్మీశ, పలుశాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న మంత్రి సవిత

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిద్దాం

- మంత్రి సవిత

పెనమలూరు : మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడుకుందామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖామంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. గురువారం పోరంకి వందడుగుల రోడ్డులోని అనుమోలు గార్డెన్స్ ఎదురుగా పీవీఎస్ఆర్ స్కూల్ రోడ్డులో మొక్కలు నాటిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రతి ఏడాది కోటి మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించేందుకు ప్రభుత్వం జియోట్యాగింగ్ పద్ధతి ద్వారా శ్రద్ధ తీసుకొంటోందని పేర్కొన్నారు. యువనేత బోడె వెంకట్రాం పర్యావరణ పరిరక్షణపై ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, యార్లగడ్డ సుచిత్ర, వీరంకి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఘాట్ రోడ్డులో మొక్కలు నాటుతున్న ఈవో

ఇంద్రకీలాద్రిపై పూలమొక్కలు

- ఈవో శీనా నాయక్

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై ఆహ్లాదకరంగా కనిపించేలా రంగు రంగుల పూలమొక్కలు ఏర్పాటు చేస్తున్నామని ఈవో వీకే శీనానాయక్ తెలిపారు. దేవస్థానం ఘాట్‌రోడ్డులో 'వనం-మనం' పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘాట్ రోడ్డులో వివిధ రకాల మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ వర్షాకాలంలో ఇంద్రకీలాద్రిపై ఔషధ మొక్కలు, దేవతావృక్ష మొక్కలు, నక్షత్ర, రాశులకు చెందిన మొక్కలు విస్తృతంగా నాటే ప్రక్రియ మొదలైందన్నారు. దేవస్థాన ప్రాంగణం ప్లాస్టిక్ రహితంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఆ నగదు ఎక్కడ?

(5వ పేజీ తరువాయి)

చెప్పలేదని తెలిసింది. అయోధ్యనగర్‌లోని లోటస్‌లో ఉంటున్న శ్రీనివాసరావు ఇంట్లో పోలీసులు రెవెన్యూ అధికారుల సమక్షంలో సోదాలు చేశారు. ఇంట్లో 18 కిలోల వెండి, 600 గ్రాముల బంగారం ఆభరణాలు ఉన్నట్టు గుర్తించారు. వాటిని సీజ్ చేశారు. శ్రీనివాసరావు వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు. అనంతరం అతడ్ని ప్రిన్సిపల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. శ్రీనివాసరావు పోలీస్‌స్టేషన్‌లో ఉండగా, వాసవీ క్లబ్‌కు చెందిన పలువురు అక్కడికి చేరుకున్నారు.

ఆ డబ్బు ఎక్కడ?

బాధితులంతా పోలీసులను ఆశ్రయించిన తర్వాత ముచ్చెర్ల శ్రీనివాసరావు ఆడియో వాయిస్‌ను చీటీల గ్రూపులో పోస్టు చేశాడు. రెండు రోజుల్లో వచ్చి బాధితులకు సర్దుబాటు చేస్తానని సందేశం పంపాడు. ఇప్పుడు పోలీసులు ఇంట్లో సోదాలు చేయగా, డబ్బు ఏమీ కనిపించలేదు. డబ్బు గురించి అడిగినప్పుడు తన వద్ద ఏమీ లేదని చెప్పినట్టు సమాచారం. బాధితుల నుంచి వసూలు చేసిన డబ్బుతో వేర్వేరు ప్రాంతాల్లో స్థిరాస్తులను కుటుంబసభ్యుల పేరు మీద కూడగట్టాడని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులకు శ్రీనివాసరావు చిక్కకపోతే కుటుంబం సహా ఇతర రాష్ట్రాలకు పారిపోవడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిసింది. తర్వాత కోర్టులో లొంగుబాటు పిటిషన్ వేసుకుని పోలీసులకు చిక్కకుండా మార్గం సుగమం చేసుకోవాలనుకున్నాడు. దీనికి కోర్టు బ్రేక్ వేయడంతో పారిపోవడానికి రెండో ప్రణాళిక వేసుకున్నాడు. త్వరలో శ్రీనివాసరావును కస్టడీలోకి తీసుకుని డబ్బు, ఆస్తుల వివరాల లెక్కలు తేల్చాలని పోలీసులు భావిస్తున్నారు.

వైద్యశాఖలో అవినీతి రోగం

(5వ పేజీ తరువాయి)

ఏఎన్ఎంలకు పదోన్నతులు ఇవ్వాలని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయ అధికారులను ఆదేశించారు. ఆ ఆదేశాలను సైతం పట్టించుకోకుండా జాప్యం చేయడంతో ఏఎన్ఎంలు తిరగబడి మంగళవారం రాత్రి ఆందోళనకు దిగారు. ఎట్టకేలకు దిగొచ్చిన అధికారులు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రకటించారు. బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించి 245 మందికి పదోన్నతులు ఇచ్చారు. 17 మందికి సంబంధించిన సర్టిఫికెట్లు సక్రమంగా లేవనే కారణం చూపి వాయిదా వేశారు. ఈ సమయంలోనే డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో అధికారుల పనితీరుపై, ఇక్కడ జరుగుతున్న అక్రమాలపై ఉద్యోగులు బహిరంగంగానే చర్చించుకోవడం కనిపించింది.

జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకొచ్చి డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో పనిచేయిస్తున్నారు. ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే వీరు ఇక్కడ పనిచేస్తున్నారు. పర్యవేక్షక కమిటీ, మరో పేరుతో ఇక్కడ పనిచేయిస్తూ పలు అక్రమాలకు తెరతీస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేనివిధంగా ఈ పర్యవేక్షక కమిటీని ఇక్కడే ఏర్పాటు చేశారని ఉద్యోగులు చెప్పుకొంటున్నారు. జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, లేబరేటరీలకు సంబంధించిన రెన్యువల్, పరిపాలనాపరమైన అంశాల్లో డిప్యూటేషన్‌పై వచ్చే పనిచేసే ఉద్యోగులు కలగజేసుకుంటున్నారు. తనిఖీల పేరుతో వెళ్లి పెద్దమొత్తంలో నగదు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఉద్యోగులు తనిఖీల నిమిత్తం వస్తే అడిగినంత ఇవ్వాల్సిందేనని ఆసుపత్రుల యజమానులు, ల్యాబ్‌లు నడిపేవారు చెబుతున్నారు. వీరి వెనువెనుక డీఎంఅండ్‌హెచ్ కార్యాలయంలో పనిచేసే కీలక అధికారి ఉన్నాడని, ఆయన చెప్పినట్టుగానే ఈ ఉద్యోగులు నడుచుకుంటున్నారని కార్యాలయ ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు.

ప్రతి పనికీ ఓ రేటు

డీఎంఅండ్‌హెచ్ కార్యాలయ పరిధిలో పనిచేసే ఉద్యోగుల సర్వీసులకు సంబంధించి రెండేళ్లకోసారి ఎస్ఆర్‌లను తనిఖీ చేయాలి, రిమార్కులు రాయాలి. దీంతో పాటు సరెండ్ లీవ్‌లు, ప్రసూతి, ఇతరత్రా సెలవులు మంజూరు చేయాలన్నా, సెలవుల అనంతరం మళ్లీ ఉద్యోగంలో చేరుతున్నట్లుగా ఉత్తర్వులు జారీ చేయాలన్నా కనీసం ఒక్కో ఉద్యోగి రూ.5 వేల నుంచి రూ.10 వేలు సమర్పించుకోవాలని ఉద్యోగులు బహిరంగంగానే చెబుతున్నారు. క్లాస్-4 ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన ఫైళ్లు కదపాలన్నా, పదోన్నతులు ఇవ్వాలన్నా ఒక్కొక్కరి నుంచి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారని ఉద్యోగులే చెప్పుకొంటున్నారు. పరిపాలనాపరమైన వ్యవహారాలకు సంబంధించిన ఫైళ్లు చూసే ఒక అధికారి అందరి నుంచి నగదు వసూలు చేస్తున్నాడని, తన చేతికి మాత్రం మట్టి అంటకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాడని ఉద్యోగులు చెబుతున్నారు. మచిలీపట్నం, గూడూరు, గన్నవరం, పెడన మండలాల్లో పనిచేస్తూ, డిప్యూటేషన్‌పై వచ్చి డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయ అధికారులతో కీలక అంశాల్లో మంచి సంబంధాలు ఉన్న ఉద్యోగులు నగదు వ్యవహారాలను నడపడంలో సిద్ధహస్తులుగా మారారనే ఆరోపణలు ఉన్నాయి. పీహెచ్‌సీల్లో వీరి అవసరం ఉన్నా ఇక్కడే కొనసాగించడంపై బలమైన కారణాలు ఉన్నాయని అంటున్నారు. ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతుల్లో గుట్టుచప్పుడు కాకుండా గన్నవరానికి చెందిన ఒక ఏఎన్ఎం నుంచి నగదు వసూలుచేసిన అంశంపై కొందరు ఉద్యోగులు నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయ అధికారులను తీవ్రస్థాయిలో హెచ్చరించినా నేటికీ ఈ మహిళా ఉద్యోగి హవా తగ్గలేదనేది అందరూ చెప్పుకొనే మాటే.

నోయిడా టు బెజవాడ

(5వ పేజీ తరువాయి)

తిరుమలశెట్టి జీవన్‌కుమార్ (సనత్‌నగర్), బొంతు నితీష్‌కుమార్ (ఫన్‌టైం క్లబ్ రోడ్డు), తూలిమెల్లి తరుణ్‌ప్రసాద్ (యనమలకుదురు)ను విచారణ చేయగా, అనేక కోణాలు వెలుగులోకి వచ్చినట్టు తెలిసింది.

రప్పించేది ఒకరు.. విక్రయించేది మరొకరు..

నిందితుల్లో జీవన్‌కుమార్ అనే వ్యక్తి ఎండీఎంఏ డ్రగ్‌ను విద్యార్థులకు అందజేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. బీటెక్ చదివిన జీవన్‌కు ఇంటర్ నుంచే డ్రగ్ అలవాటు ఉంది. ఆ తర్వాత దాన్ని కొనసాగించాడు. ఉత్తరప్రదేశ్‌లో ఉంటున్న స్నేహితుడు మనోహర్.. నోయిడాకు చెందిన రింకీ అనే యువకుడ్ని పరిచయం చేశాడు. ఆ తర్వాత జీవన్ దందా కొత్త మలుపులు తిరిగింది. కృష్ణాజిల్లా గంగూరులోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న నితీష్‌కుమార్‌కు డ్రగ్‌ను అలవాటు చేశాడు. తర్వాత అతడ్ని తన సహాయకుడిగా మార్చుకున్నాడు. ఇలా ఇద్దరూ కలిసి ఓ పద్ధతి ప్రకారం సరుకు రాబట్టే ప్లాన్ చేశారు. నోయిడాలో ఉన్న రింకీకి హైదరాబాద్‌లో ఉంటున్న స్నేహితుల ఇళ్లు, హాస్టళ్ల చిరునామాలు ఇస్తాడు. అక్కడికి నోయిడా నుంచి ఎండీఎంఏను పార్శిల్ ద్వారా రప్పించుకుంటాడు. ట్రాకర్ ఆన్, డీటీడీసీ అనే రెండు కొరియర్ సంస్థల ద్వారా సరుకు హైదరాబాద్ చేరుతోంది. చిరునామా వేర్వేరుగా ఉన్నా ఫోన్ నెంబర్ మాత్రం జీవన్‌దే ఇచ్చేవాడు. పార్శిల్ ఇవ్వడానికి వెళ్లిన బాయ్స్ ఈ నెంబర్‌కు ఫోన్ చేసేవారు. తాను వేరేచోట ఉన్నానని, మర్నాడు తీసుకుంటానని చెప్పేవాడు. ఆ తర్వాత విజయవాడ నుంచి రైల్లో కానీ, బస్సులో కానీ, బైక్‌పై కానీ హైదరాబాద్ వెళ్లి తీసుకునేవాడు. ఇలా విజయవాడకు చేర్చిన పార్శిల్‌లోని డ్రగ్‌ను నితీష్‌కుమార్ ద్వారా విక్రయించేవాడు. ఏడాదిగా జీవన్ ఇలాగే డ్రగ్‌ను తెప్పిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. జీవన్, నితీష్ సెల్‌ఫోన్లను పరిశీలించగా, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో పాటు గుంటూరు జిల్లాలోని డీమ్డ్ వర్సిటీ విద్యార్థుల ఫోన్ నెంబర్లు ఉన్నట్టు గుర్తించారు. రింకీ అనే వ్యక్తి జీవన్‌కు సరుకును పంపుతున్నప్పటికీ దానికి సంబంధించిన చెల్లింపులు మాత్రం వేరే వ్యక్తికి చేసేవాడు. ఢిల్లీకి చెందిన బంధోపాధ్యాయ చౌదరి అనే వ్యక్తి జీవన్‌కు క్యూఆర్ కోడ్‌ను పంపేవాడు. దానికి పేమెంట్ సర్వీస్ యాప్‌ల ద్వారా చెల్లింపులు చేసేవాడు. గ్రాము ఎండీఎంఏను రూ.4 వేలకు కొని ఇక్కడి విద్యార్థులకు మాత్రం గ్రాము రూ.6 వేలకు విక్రయిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ ముగ్గురు నిందితులకు విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో గురువారం వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం వారిని నాల్గో ఏసీఎంఎం కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి రామ్మోహన్‌నాయుడు 14 రోజుల రిమాండ్ విధించారు.




నెట్టెం రఘురాంకు అభినందనలు తెలుపుతున్న శంకరబాబు

డీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాంకు వెలగపూడి అభినందనలు

పెనమలూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా గురువారం ప్రమాణ స్వీకారం చేసిన నెట్టెం రఘురాంకు టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు అభినందనలు తెలిపారు. కేంద్ర సహకార బ్యాంకు అభివృద్ధికి చైర్మన్ రఘురాం తన వంతు కృషి చేస్తారనే విశ్వాసాన్ని శంకరబాబు వ్యక్తం చేశారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

ఉంగుటూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు, తేలప్రోలు విద్యుత్ సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ ఉంగుటూరు, ఆత్కూరు సబ్‌స్టేషన్ ఏరియాల్లో ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈనెల 6వ తేదీ శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ గుడివాడ డివిజన్ ఈఈ జి.వి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొయ్యగూరపాడు, ఉంగుటూరు, ఆత్కూరు గ్రామాల్లో ఐదు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, రైతులు, గృహ, వాణిజ్య వినియోగదారులు గమనించి సహకరించాలని ఈఈ కోరారు.

విద్యా కిట్ల తనిఖీ

విజయవాడ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు తెరచే నాటికి విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్ల పేరుతో పాఠ్యపుస్తకాలతో పాటు, బ్యాగులు, దుస్తులు, షూ, బెల్టులతో కూడిన కిట్లను అందించనున్నారు. నున్న గ్రామం జడ్పీహైస్కూల్‌లోని స్టాక్ పా యింట్‌ను గురువారం రాష్ట్ర పరిశీలకులు ఏ. కృష్ణమోహన్ తనిఖీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా సీఎంవో ఎస్. చంద్రశేఖర్, ఐఈడీ కోఆర్డినేటర్ ఎల్. వెంకటేశ్వరరావులతో కలసి పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా కిట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు తెరచే నాటికి విద్యార్థులకు కిట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

లాసెట్ సెట్‌కు 61 మంది గైర్హాజరు

కానూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : న్యాయ కళాశాలల్లో ప్రవేశాలకు గురువారం కానూరులోని రెండు కేంద్రాలల్లో నిర్వహించిన ఏపీ లాసెట్- 2025 ప్రశాంతంగా ముగిసింది. కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో లాసెట్‌కు 250 మంది అభ్యర్థులను కేటాయించగా వారిలో 210 మంది హాజరయ్యారు. 40 మంది గైర్హాజరైనట్లు సిద్ధార్థ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. రవిచంద్ర చెప్పారు. పీవీపీ సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జరిగిన లాసెట్‌కు వంద మంది అభ్యర్థులను కేటాయించగా వారిలో 79 మంది పరీక్షకు హాజరుకాగా, 21 మంది గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శివాజీ తెలిపారు.

ఏడాది పాలనపై మల్లవల్లిలో టీడీపీ సంబరాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నియంతృత్వ, విధ్వంసకర పాలన పారదోలి ప్రజలు అభివృద్ధి, సంక్షేమం అందించే కూటమి ప్రభుత్వానికి చారిత్రాత్మక విజయాన్ని అందించారని టీడీపీ నాయకులు వేముల నాగరాజు, అక్కినేని ధర్మరాజు అన్నారు. మల్లవల్లిలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ప్రపంచ వ్యాప్తంగా గౌరవించే భారతదేశ కుటుంబ వ్యవస్థకు వెన్నుపోటు పొడిచి తల్లిని, చెల్లిని ఇంటి నుంచి వెళ్లగొట్టిన ఘనుడు జగన్ అని విమర్శించారు. పేదలకు సకాలంలో సంక్షేమాన్ని అందిస్తూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే మల్లవల్లి పారిశ్రామికవాడ అభివృద్ధిని గాడిలో పెట్టిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. అక్కినేని కృష్ణాజీ, వేముల కాసులు, అత్తి రమేష్, దండగల దేవరాజు, తదితరులతో పాటు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు ప్రాధాన్యం

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్


గన్నవరంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, తదితరులు

గన్నవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో పచ్చదనం పెంపొందించేదుకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అన్నారు. గాంధీ బొమ్మ సెంటర్లో గురువారం మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. నియోజవర్గంలోని గ్రామాలతోపాటు రామవరప్పాడు నుంచి బొమ్మలూరు వరకు జాతీయ రహదారిపై పచ్చదనాన్ని పెంపొందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే బాపులపాడులో మొక్కలు నాటామని, గన్నవరంలోనూ మొక్కలు నాటుతున్నామని, మరో 10 రోజుల్లోనూ రామవరప్పాడులోనూ మొక్క లు నాటే కార్యక్రమం చేపడతామని వివరించారు. గతంలో గన్నవరం విమానాశ్రయం నుంచి రామవరప్పాడు వరకు 45వేల చదరపు మీటర్లు ఉన్న పచ్చదనాన్ని మరో 45 వేల చదరపు అడుగులకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. యుద్ధ ప్రాతిపదికన కాలువల మరమ్మతులు పూర్తి చేసిన అనంతరం సాగునీరు విడుదల చేయనున్నట్లు యార్లగడ్డ వివరించారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, ఎంపీటీసీ సభ్యులు పడమట రంగారావు, మద్దినేని వెంకటేశ్వరరావు, నాయకుడు దొంతు చిన్న, మేడేపల్లి రమా యనమదల సతీష్, పాలడుగు మల్లికార్జునరావు, ఆళ్ల గోపాలకృష్ణ, ఆరుమళ్ళ కృష్ణారెడ్డి, గొడ్డళ్ళ చిన్న రామారావు, మూల్పూరి సాయి కళ్యాణి, బిజెపి నాయకులు చిగురుపాటి కుమారస్వామి, నాదెండ్ల మోహన్ తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** పర్యావరణాన్ని కాపాడుకోవడంతో పాటు జల వనరులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రతి వ్యక్తి మొక్క నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఎస్ఎస్ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా గ్రామాల్లో మొక్కలు నాటారు. రంగన్నగూడెంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎస్ఎస్ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ తదితరులు మొక్కలు నాటారు. ఆరుగొలనులో తుమ్మల బ్రహ్మాజీ, బేతా శేమకుమార్, తదితరులు, వీరవల్లిలో గుండపనేని ఉమావరప్రసాద్, కలపాల శ్రీధర్, మండాది రవీంద్ర, కోడూరుపాడు, ఉమామహేశ్వరపురంలో ఆర్నేపల్లి సూరిబాబు, పాండురంగారావు, కొండపల్లి వెంకన్న, తదితరులు మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. ఎస్.ఎన్.పాలెంలో సర్పంచ్ అడపా అంజిబాబు, కంపసాటి కొండలరావు తదితరులు, బొమ్ములూరులో సర్పంచ్ కాటూరు విజయ భాస్కర్, ఈవో సుభాష్‌కుమార్, కొల్లి చందు, వేగే కృష్ణారావు తదితరులు మొక్కలు నాటారు. మల్లవల్లి, కొత్తపల్లి, బిళ్లనపల్లి, మడిచర్ల, కానుమోలు, పెరికీడు, తదితర గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్ :** పర్యావరణాన్ని మనం రక్షించినపుడే మానవాళికి మనుగడ ఉంటుందని బాపులపాడు ఎంపీపీ వైన గేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ నగేశ్, జడ్పీటీసీ సభ్యురాలు గంగాభవాని,


రంగన్నగూడెంలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ రంగామణి

మండల పరిషత్ ఏవో త్రినాథ్‌తో కలిసి మొక్కలు నాటారు. బాపులపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి పూర్ణేశ్వరి ఆధ్వర్యంలో కృష్ణా నగర్‌లో మొక్కలు నాటారు. మండలం వ్యాప్తంగా ప్రతి గ్రామంలో వంద మొక్కలు చొప్పున నాటారు. ఉపాధి హామీ ఏపీవో అశోక్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. **ఉయ్యూరు :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని ఉయ్యూరు, మండల పరిధి గ్రామాల్లో గురువారం మొక్కలు నాటారు. ఉయ్యూరు 20వ వార్డులో నగరపంచాయతీ చైర్మన్ వి.సత్యనారాయణ, కమిషనర్ వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు, ఉద్యోగులు మొక్కలు నాటారు. కేసీపీ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కర్మాగార ఆవరణలో పర్యావరణ దినోత్సవం నిర్వహించి, కార్మికులు, ఉద్యోగులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నాటారు. యూనిట్ హెడ్ సీతారామదాస్, ఉద్యోగులు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు. కడవకొల్లులో ఎంపీడీవో శేషగిరిరావు, డీఎల్‌డీవో రాజేశ్, కోటేశ్వరరావు త దితరులు మొక్కలు నాటారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శేఖర్‌బాబు, ఎన్‌సీసీ ఆఫీసర్ శ్రీరామ్‌తేజ పాల్గొని మొక్కలు నాటి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలు తెలిజేశారు. **ఉంగుటూరు :** పచ్చదనం పెంపులో అందరూ భాగస్వాములు కావాలని టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొలుసు రవీంద్రబాబు,


బాపులపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న ఎంపీపీ నగేశ్

కుందేటి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. వన మహోత్సవ కార్యక్రమం మండలంలోని అన్నిగ్రామాల్లో గురువారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆత్కూ రు,పెదఅవుటపల్లి, వేంపాడు, గ్రామాల్లో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయసిబ్బందితో కలిసి రవీంద్రబాబు, చంద్రశేఖర్ మొక్కలు నాటారు. టీడీపీ గ్రామ నాయకులు అట్లూరి రామ్‌కిరణ్, దారం విజయ్, సీనియర్ నాయకులు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, నాయకులు వినీల్, జయరాజు, సాంబయ్య, సింహాచలం, విజయ్, శివనాగబాబు తదితరులు పాల్గొన్నారు. తల్లి పేరుతో ఓ మొక్క కార్యక్రమంలో భాగంగా వేమండ పంచాయతీ కార్యాలయంలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాతృ మూర్తి లక్ష్మీసామ్రాజ్యం పేరు మీద టీడీపీ గ్రామ అధ్యక్షుడు తోట నాగభూషణం మొక్క నాటారు. ఉపసర్పంచ్ నరిశెట్టి శ్రీనివాసరావు, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు. తుట్టగుంటలో సర్పంచ్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి మొక్కలు నాటారు. ఉపసర్పంచ్, నాగభూషణం, గ్రామపెద్దలు, ఉపాధిసిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని, ఎంపీడీవో ఈ.సత్యకుమార్ మొక్కలు నాటారు. మండలంలో 27 పంచాయతీల్లో 2914 మొక్కలు నాటినట్లు ఎంపీడీవో తెలిపారు.

గన్నవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని గన్నవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి ఎస్.గాయత్రి అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటి ర్యాలీ చేశారు. గాయత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్క నాటి సంరక్షించాలని సూచించారు. ఏపీపీ ఎస్టీజీ నీరజ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గారపాటి రవికుమార్, కార్యదర్శి రామకూరి ప్రకాష్, సోమేశ్వరరావు, నల్లమోతు రమేష్, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలను పంపిణీ చేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్, ఎం.బాలకృష్ణమూర్తి, కర్రా వర ప్రసాద్, వీసం ప్రసాదరావు, ముక్కామల సుబ్బారావు, వి.వి.కృష్ణమోహన్, పొట్లూరి రామకృష్ణ, వడ్లమూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఉయ్యూరులో మొక్కలు నాటుతున్న చైర్మన్ వి.సత్యనారాయణ, కమిషనర్ వెంకటేశ్వరరావు


ఆత్కూరులో మొక్కలు నాటుతున్న రవీంద్రబాబు, చంద్రశేఖర్

సామూహిక వేంకటేశ్వర స్వామి వ్రతం

హనుమాన్‌జంక్షన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన వ్రతంలో అధిక సంఖ్యలో మహి ళలు పాల్గొన్నారు. ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు, అరుణ దంపతులు భక్తులకు అవసరమైన పూజా సామగ్రిని ఉచితంగా అందజేశారు.

అన్నదాత సుఖీభవ కౌలురైతుకూ అందించాలి

● టి.వి. లక్ష్మణస్వామి

ఉంగుటూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయాన్ని ప్రతి కౌలురైతుకీ అందించాలని కౌలురైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.వి. లక్ష్మణస్వామి అన్నారు. కౌలురైతుసంఘం, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు గురువారం కౌలురైతుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు అందజేశారు. లక్ష్మణస్వామి మాట్లాడుతూ కౌలు గుర్తింపుకార్డుకు భూయజమాని అనుమతి కావాలి అనే నిబంధన కారణంగా 10 శాతం మందికే కౌలు గుర్తింపు కార్డులు అందుతున్నాయన్నారు. ఫలితంగా సాగు పెట్టుబడికి ప్రభుత్వ సాయం అందక ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి కౌలురైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని


వినతిపత్రం అందజేస్తున్న కౌలురైతు, వ్యవసాయ కార్మికసంఘం నేతలు

ఆవేదన వ్యక్తంచేశారు. భూయజమాని అనుమతితో సంబంధం లేకుండా కౌలుదారులకు గుర్తింపుకార్డులిచ్చే అంశాన్ని పరిశీలిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలుచేయాలని డిమాండ్‌చేశారు. కౌలురైతు సంఘం నాయకులు షేక్ సలీం, బాబూరావు, వ్యవసాయకార్మికసంఘం జిల్లాసహాయ కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాల్వలు, డ్రెయిన్లలో పూడికతీయాలి

● కాకులపాడు డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు కాల్వకు అనుసంధానంగా ఉన్న కాకులపాడు చానల్, పెరికీడు డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించి పూడిక తీసి చివరి భూ ములకు సకాలంలో సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని కాకులపాడు డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ జలవనరులశాఖ అధికారులను కోరారు. గుడివాడ డ్రైనేజీ సర్కిల్ పరిధిలోని డీసీ చైర్మన్ల సమావేశంలో గురువారం ఆయన పాల్గొన్నారు. జలవనరుల శాఖ ఈఈ కిరణ్‌బాబు, డీఈ గణపతి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అంపాపురం డ్రెయిన్ అక్రమణలకు గురై చెత్తతో నిండిపోయి నీరు ప్రవహించేందుకు ఆస్కారం లేదన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల


సమావేశంలో మాట్లాడుతున్న కాకులపాడు డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్

సాగునీటి కాల్వలకు అనధికారిక తూములు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో సాగునీటి కాల్వలను పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు.


పూజల్లో పాల్గొన్న బోడె వెంకట్ రామ్

వైభవంగా ఆంజనేయస్వామి కల్యాణ మహోత్సవం

కంకిపాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కోలవెన్ను శివారు మాదాసువారిపాలెంలో సువర్చల సమేత ఆంజనేయ స్వామి 74వ వార్షిక కల్యాణ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు బోడె వెంకట్ రామ్, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, కొప్పరాజు సురేష్, తోట సతీష్, గుమ్మడి కిరణ్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోదండరామ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నేటి నుంచి

పెనమలూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పోరంకి శ్రీనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన కోదండరామ స్వామి ఆలయంలో సీతారామ హనుమత్ సమేత కోదండరామ, సిద్ధి గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర విగ్రహ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం గణపతి పూజ, గోపూజ, అంకురారోపణ, సాయంత్ర 4గంటలకు యంత్రమంత్రానుష్టానాలు, ప్రదోషకాలార్చనలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాల్సిందిగా కమిటీ నాయకులు కోరారు.

నారాయణ విద్యాసంస్థల విజయోత్సవ ర్యాలీ

పెనమలూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ-అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 10వ ర్యాంకు (సౌత్ ఇండియా 1వ ర్యాంకు), 82వ ర్యాంకు, 98వ ర్యాంకులు సాధించి విజయవాడ విద్యా చరిత్రనే తిరగ రాసిన సందర్భంగా నారాయణ విద్యా సంస్థల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని విద్యాసంస్థల కోర్ డీన్ గుడ్లవల్లేటి శ్రీనివాస్, డీజీఎం జాగర్లమూడి రవిశంకర్, ఏజీఎం మురళీకిషోర్ ప్రారంభించారు. కానూరు ఎన్-120, సూపర్‌విజ్, శివాని భవన్, నిడమానూరు, గూడవల్లి, కరెన్సీనగర్, లబ్బీపేటలలోని నారాయణ క్యాంపస్‌ల మీదుగా ర్యాలీ సాగింది. విద్యార్థులు తీన్మార్ డప్పు వాయి


విజయోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

ద్యాలతో నృత్యాలు చేస్తూ ర్యాలీని విజయవంతం చేశారు. ర్యాలీలో అడ్వాన్స్‌డ్ విజేతలు, తల్లిదండ్రులు, డీన్లు శ్రీరాంచంద్ చౌదరి, కె.శ్రీనివాస్, రమేష్, పూర్ణచంద్రరావు, శైలజ, ఏజీఎంలు రాజశేఖర్ బాబు, సురేంద్ర, మోహన్‌కృష్ణ, రఘుబాబు, రామారావు, ఆదినారాయణ, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే సమన్వయ కర్త సుధారాణి

ఉయ్యూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా నోడల్ అధికారి, కేవీకే సమన్వయకర్త డి.సుధారాణి అన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రామకృష్ణ రిక్రియేషన్ క్లబ్ ఆడిటోరియంలో గురువారం వ్యవసాయ శాస్త్రవేత్తలతో ఇష్టాగోష్టి నిర్వహించి రైతులతో సమావేశం నిర్వహించారు. సార్వా పంటకు అనువైన వరి రకాలు, ఆరోగ్యవంతమైన నారు పెంచే విధానాన్ని శాస్త్రవేత్త ఎం.వెంకటలక్ష్మి తెలియజేశారు. ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ, భూసార పరీక్షల ముఖ్య ఉద్దేశం జ్యోతి రమణి వివరించారు. గన్నవరం ఏడీఏ సునీల్, కల్యాణ్ బాబు, ఏవో నిస్సీగ్రేస్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ఎనిమిది గంటల పనిదినాన్ని కొనసాగించాలి

హనుమాన్‌జంక్షన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఎనిమిది గంటల పనిదినాన్ని సాధించుకున్న కార్మిక వర్గంపై 12 గంటల పనిని రుద్దుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సీఐటీయూ బాపులపాడు మండల అధ్యక్షుడు బేత శ్రీనివాసరావు గురువారం ప్రకటనలో ఖండించారు. కార్మికుల హక్కులు కాలరాసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అన్యాయమన్నారు. కార్పొరేట్ కంపెనీలకు లాభా లు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. కేంద్రం కూడా కార్మిక చట్టాలను తుంగలో తొక్కి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడాన్ని నిరసిస్తూ జూలై 9న దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్మిక వర్గం సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

నైతిక విలువలు పెంపొందించేందుకు నీతికథలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : నీతికథలు విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందడంతో పాటు మంచి పౌరులుగా ఎదిగేందుకు సహాయ పడతాయని గ్రంథాలయాధికారి స్వర్ణలతాదేవి తెలిపారు. వీరవల్లి గ్రంథాలయ ఆవరణలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం పెద్ద బాలశిక్షలోని నీతి కథలను చదివించి, నేర్చుకున్న అంశాలపై సమీక్ష నిర్వహించారు. పేపర్ క్రాఫ్ట్ వర్క్ నేర్పించి పూల ఆకృతులను తయారు చేయించారు. విద్యార్థులకు డ్యాన్స్, క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు.



ర్యాలీలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

● మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. మంగినపూడి బీచ్‌లో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం మంత్రి రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, బ్రహ్మకుమారి సబిత మొక్కలు నాటారు. అనంతరం మంత్రి అందరితో ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సీరియస్‌గా తీసుకున్నారన్నారు. మొక్కలు పెద్దవై వృక్షాలవుతాయని, దీంతో వాతారణ సమతుల్యత ఏర్పడుతుందన్నారు. కలెక్టర్ బాలాజీ, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే యార్లగడ్డతో టీడీపీ సౌతాఫ్రికా అధ్యక్షుడి భేటీ

గన్నవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును టీడీపీ సౌతాఫ్రికా అధ్యక్షుడు, పీఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ పారా రామకృష్ణ గురువారం మర్యాదపూర్వకంగా కలశారు. దుశ్శాలువ కప్పి పూలబొకే అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు సహాయం చేయటంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని రామకృష్ణ తెలిపారు.



ఎమ్మెల్యే యార్లగడ్డకు పూల బొకే ఇస్తున్న రామకృష్ణ

మిస్ తెలుగు అమెరికా విజేత నిహారిక



పెడన, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) నిర్వహించిన మిస్ తెలుగు అమెరికా పోటీల్లో పెడనకు చెందిన బవిరిశెట్టి ఆనందరావు, పావని దంపతుల కుమార్తె నిహారిక విజేతగా నిలిచి కిరీటం కైవసం చేసుకున్నారు. నిహారిక అమెరికాలోని న్యూయార్క్ నగరంలోని లాగ్ ఐలాండ్ వర్సిటీలో ఎంఎస్ చదువుతోంది. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా, వాసవీ క్లబ్ అధ్యక్షురాలు కొమ్మూరి విజయదుర్గ, వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు తమ్మన లక్ష్మీతాయారు నిహారికను అభినందించారు.

ఖయ్యూంను రేషన్ కార్డులో నమోదు చేస్తాం

● తహసీల్దార్ రామకోటేశ్వరరావు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గుడివాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే మానసిక వికలాంగుడైన ఖయ్యూం పేరును రేషన్ కార్డు నుంచి వలంటీర్ నిర్లక్ష్యం కారణంగా తొలగించిన విషయాన్ని ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం 'పాపం ఖయ్యూం' కథనం ప్రచురితమైంది. దీనిపై స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం స్పందించి గురువారం వెంటనే విచారణ చేపట్టాలని తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావుకు ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టగా ఖయ్యూం పేరును తొలగించారని గుర్తించారు. వెంటనే కార్డులో అతడి పేరును పునరుద్ధరించేలా, తల్లి రేషన్ కార్డులో ఖయ్యూం పేరును చేర్చేందుకు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు తెలిపారు. రేషన్ కార్డులో పేరు తొలగించడంతో బాధపడుతున్న ఖయ్యూం తల్లి ప్యారీజాన్ సంతోషం వ్యక్తం చేశారు. కార్డులో పేరును పునరుద్ధరించేలా చొరవ చూపిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఆర్‌డీవో బాలసుబ్రహ్మణ్యంకు 11వ వార్డు ఇన్‌చార్జ్ సయ్యద్ జబీన్ ధన్యవాదాలు తెలిపారు.

పారదర్శకంగానే బదిలీలు

హనుమాన్‌జంక్షన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పౌర గ్రంథాలయ శాఖల్లో నిర్వహించిన బదిలీలు పారదర్శకంగానే సాగాయని ప్రముఖ దినపత్రికల్లో వాస్తవాలను వక్రీకరిస్తూ రాసిన కథనాలను గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి. రాంబాబు, నాదెండ్ల బాబ్జీ గురువారం ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు మే 31న కౌన్సెలింగ్ ద్వారా అధికారులు బదిలీలు నిర్వహించారన్నారు. నిజాయితీగా, పారదర్శకంగా నిబంధనలు మేరకు బదిలీలు జరిగాయన్నారు. రూ.లక్షలు ముడుపులు చెల్లించి బదిలీలు చేయించుకునే ఆర్థిక పరిస్థితి గ్రంథాలయ ఉద్యోగులకు లేదన్నారు.


జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయండి

● ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు ఏపీఎంపీఏ శుభాకాంక్షలు



విజయవాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీ రాఘవాచారి ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆలపాటి సురేష్ కుమార్‌ను గురువారం ఉదయం నగరంలోని సీఆర్ ప్రెస్ అకాడమీలో ఏపీఎంపీఏ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించి, వారి సంక్షేమానికి కృషి చేయాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్ కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు యేమినేని వెంకట రమణ, రాష్ట్ర కోశాధికారి మత్తి శ్రీకాంత్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పసుపులేటి చైతన్య, నేతలు రాజా, గుర్రం శ్రీనివాసరావు, వేల్పుల ప్రశాంత్, ఎన్ఎస్ఆర్‌డీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో హోంగార్డు మృతి



బంటుమిల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఓఎన్‌జీసీలో హోంగార్డుగా పనిచేస్తున్న లేళ్ల రవిబాబు (39) అనుమానాస్పదరీతిలో మృతి చెం దారు. కలిదిండి మండలం భాస్కరరావుపేటకు చెందిన లేళ్ల రవిబా బు కృత్తివెన్ను మండలం చినపాండ్రాక ఓఎన్‌జీసీలో కొంతకాలంగా హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. అతడికి భార్య, ఇద్దరు పిల్ల లు. బంటుమిల్లిలోని నటరాజ్ థియేటర్ వెనుక అద్దెకుంటున్నారు. గురువారం ఉదయం సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉండడంతో కు టుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు పాల్పడే నాటికి కుటుంబ సభ్యులు స్వగ్రామమైన భాస్కరరావుపేటలో ఉన్నా రు. అనారోగ్య కారణంగా తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డారని భార్య రజినీ కుమారి బంటుమిల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై గణేష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హూందాతనానికి మారుపేరు నెట్టెం

● రఘురాం నాయకత్వంలో కేడీసీసీబీ మరింత అభివృద్ధి ● పలువురు వక్తల ప్రశంస



కేడీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నెట్టెం రఘురామ్‌ను అభినందిస్తూ మాట్లాడుతున్న ఎంపీ చిన్ని

వన్‌టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఓర్పునకు, హూందాతనానికి మారుపేరు టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ అని, ఆయన నాయకత్వంలో కేడీసీసీ బ్యాంకు మరింత అభివృద్ధిలోకి పయనిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం బందరు రోడ్డులోని కేడీసీసీ బ్యాంకులో చైర్మన్‌గా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సభకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ నీతికి, నిజాయితీకి నిలబడి పార్టీకి అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు ఉందనడానికి నిదర్శనమే రఘురామ్‌కు ఈ పదవి అన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ నెట్టెం రఘురామ్‌కు కేడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవి అలంకారం మాత్రమేనన్నారు. తన అనుభవంతో బ్యాంకును మరింత వృద్ధిలోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ నెట్టెం రఘురామ్ పెద్ద మనిషి అని అటువంటి వ్యక్తికి ఒక సముచిత స్థానాన్ని సీఎం చంద్రబాబు కల్పించారన్నారు. రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన బ్యాంకు కేడీసీసీ బ్యాంక్ అని, రూ.13 వేల కోట్ల టర్నోవర్ గల బ్యాంకుకు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నెట్టెం నాయకత్వంలో బ్యాంకు మరింత వృద్ధిలోకి వస్తుందన్నారు. గన్నవరం ఎమ్మెల్యే, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవి రఘురామ్‌కు చిన్నదని భావిస్తున్నానన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ దేశ సహకారరంగ చరిత్రలో కృష్ణాజిల్లా సహకార బ్యాంకుకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. రైతులకు వెన్నుదన్నుగా నిలిచిన బ్యాంకు కేడీసీసీ బ్యాంకు అని కొనియాడారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ నెట్టెం రఘురామ్ జిల్లాలోనే జంటిల్‌మెన్ లీడర్ అని కొనియాడారు. ఆయనకు ఆప్కాబ్ చైర్మన్ ఇస్తారని అనుకున్నామని, కానీ పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలి కాబట్టి ముందుకు పోతున్నామన్నారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ తన ఆత్మీయ సభకు ఇంతమంది ప్రముఖులు, నేతలు రావటం ఊహించలేదన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న వెంటనే ఉద్యోగులతో రివ్యూ చేశానన్నారు. 1915లో ప్రారంభమైన ఈ బ్యాంకు ప్రతిష్టకు భంగం కలగకుండా మరింతగా అభివృద్ధి చేస్తానన్నారు. మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు వసంత వెంకట కృష్ణప్రసాద్, కొలికలపూడి శ్రీనివాసరావు, కాగిత కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తదితరులు నెట్టెం రఘురామ్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయన్ను గజమాలతో ఘనంగా సత్కరించారు. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు కొమ్మారెడ్డి పట్టాభిరామ్, రావి వెంకటేశ్వరరావు, వీరంకి గురుమూర్తి, జి.రఘురామరాజు, ఎస్.దేవదత్, గుమ్మడి గోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, యువ నేత బోడే వెంకట్రావు, పార్టీ సీనియర్ నేతలు గన్నె అన్న, కార్పొరేటర్లు పాల్గొన్నారు

ఎస్ఎల్‌వీ గ్రూప్ చైర్మన్ అభినందన



గవర్నర్‌పేట: కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కేడీసీసీబీ) చైర్మన్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన మాజీ మంత్రి నెట్టెం రఘురామ్‌ను ఎస్ఎల్‌వీ గ్రూప్ చైర్మన్ పెన్మెత్స శ్రీనివాసరాజు అభినందించారు. ఎంజీ రోడ్డులోని కేడీసీసీ బ్యాంకులో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఆయన పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. నిత్య కృషీవలుడు నెట్టెం రఘురామ్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, బ్యాంకు చైర్మన్‌గా రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చేందుకు బ్యాంకు మరింత పురోగతి సాధించేలా కృషి చేయాలని శ్రీనివాసరాజు ఆకాంక్షించారు.

శ్రీ పృథ్వీశ్వరక్షేత్రానికి భవిష్యత్తులో గొప్ప వైభవం

● ద్విసహస్రావధాని పద్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ
● ముగిసిన ఆలయ రాజగోపుర తృతీయ వార్షికోత్సవాలు


చల్లపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మహిమాన్విత శైవ క్షేత్రం నడకుదురు శ్రీపృథ్వీశ్వరస్వామి ఆలయ రాజగోపుర తృతీయ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. గురువారం ఉదయం గణపతిపూజ, గవ్యాంతర ప్రధాన కుంభ ఆవాహన, మహన్యాసం, 108 కలశాలతో అభిషేకం, శ్రీరుద్రసహిత పరివార దేవతల మంత్ర హవనములు, ఏకాదశ రుద్రాభిషేకం, మహాపూర్ణాహుతి జరిగాయి. ఆలయ సమగ్రాభివృద్ధి దాత మండవ రవీంద్ర - రమణకుమారి దంపతులు, వారి కుమార్తె, అల్లుడు డాక్టర్ యార్లగడ్డ మధుకిరణ్ - డాక్టర్ సింధూర దంపతులతో అర్చకులు కంఠంరాజు సాయిబాబుశర్మ (గణపతి దీక్షితులు) ఆధ్వర్యంలో వేదపండితులు, పురోహితులు, అర్చకులు పూజలు నిర్వహించారు. ద్విసహస్రావధాని పద్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ ముఖ్య అతిథిగా వచ్చి మహాపూర్ణాహుతిలో పాల్గొని హోమంలో ద్రవ్యములు సమర్పించారు. అనంతరం భక్తులకు అనుగ్రహభాషణ చేస్తూ ప్రాచీన శైవక్షేత్రం నడకుదురు శ్రీ పృథ్వీశ్వర క్షేత్రానికి భవిష్యత్తులో గొప్ప వైభవం వస్తుందన్నారు. రాజగోపుర నిర్మాణం, పాటలీవనంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాల దేవతామూర్తులు, సరస్వతీ అమ్మవారు, పరివార దేవతామూర్తుల విగ్రహాలతో ప్రాంగణం ఎంతో గొప్పగా ఉందన్నారు. ద్వాపరయుగం నాటి శ్రీ పృథ్వీశ్వరక్షేత్రం ఏదో ఒకనాటికి వైభవాన్ని సంతరించుకుంటుందన్నారు. ఇక్కడ స్వామిని దర్శించుకుని పూజించిన వారికి నరకం లేదన్నారు. శ్రీబాలాత్రిపురసుందరీ అమ్మవారు మహిమాన్వితమన్నారు. నరకాసురుడికి మోక్షం ప్రసాదించిన క్షేత్రానికి ఎంతో ప్రాశస్త్యం ఉందనీ, పురాణాల్లో క్షేత్ర గొప్పతనం వివరించినట్లు తెలిపారు. జీర్ణోద్ధరణకు చేరిన ఆలయాలను అభివృద్ధి చేసిన వారి పుణ్యం అపారమనీ, రాజగోపుర నిర్మాణంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్న పారిశ్రామికవేత్త మండవ రవీంద్ర - రమణకుమారి దంపతులు ధన్యులని అభినందించారు. తొలుత నాగఫణిశర్మకు మండవ రవీంద్ర దంపతులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన నాగఫణిశర్మ పాటలీవనాన్ని దర్శించారు. సరస్వతీ అమ్మవారి సన్నిధిలో పిల్లలకు నాలుకపై బీజాక్షరాలు రాశారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా మారేడు మొక్కను నాటారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాసు, రవీంద్ర కుటుంబ సభ్యులు ఆయన్ను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. ప్రముఖులు అనంత్, నాదెళ్ల ప్రభాకరరావు, మల్లుపెద్ది త్రివిక్రమరావు, నాదెళ్ల వెంకట నరసయ్య, యార్లగడ్డ శ్రీనివాసరావు, డాక్టర్ పి.మనోజ్, నాదెళ్ల శివరామకృష్ణ, గొరిపర్తి రమేష్, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



మహాపూర్ణాహుతిలో పాల్గొన్న ద్విసహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ, ఆలయ సమగ్రాభివృద్ధి దాత మండవ రవీంద్ర, రమణకుమారి దంపతులు

ప్రముఖ పారిశ్రామికవేత్త, నవత ట్రాన్స్‌పోర్టు వ్యవస్థాపకుడు

పర్వతనేని అస్తమయం



ఆటోనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కేంద్రంగా డైలీ ట్రాన్స్‌పోర్టు రంగంలో భారత దేశంలోనే పేరెన్నికగన్న నవత ట్రాన్స్‌పోర్టు సంస్థ వ్యవస్థాపకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త పర్వతనేని కోటేశ్వరరావు (87) వృద్ధాప్య సమస్యలతో గురువారం సాయంత్రం కన్నుమూశారు. తన సోదరుడు పర్వతనేని సుభాష్ చంద్రబోస్‌తో కలిసి ఆయన 1982లో విజయవాడ కేంద్రంగా నవత ట్రాన్సుపోర్టు కంపెనీని స్థాపించారు. అప్పటి నుంచి నవత వారింటిపేరుగా మారిపోయింది. రవాణా రంగంలో ఆయన సేవలు విలువకట్టలేనివి. నవత ట్రాన్సుపోర్టుతో వేలాది మందికి ఉపాధి చూపించిన దార్శనికుడు. డ్రైవర్ల పట్ల ఎంతో ప్రేమాభిమానాలతో వారి సంక్షేమానికి కృషి చేశారు. ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ప్రభుత్వ సంక్షేమ విధానాలతో ట్రాన్సుపోర్టు రంగంలో అత్యున్నత స్థానాన్ని అధిరోహించారు. సరుకు రవాణా వాహనంలో ప్యాసింజర్ల రవాణాకు అనుమతి లేకుండా సరుకు రవాణాలో భద్రతా నియమాలను కఠినంగా పాటించారు. రవాణా రంగానికి ఆయన చేసిన సేవల్లో ప్రప్రమథంగా చెప్పుకునే నందిగామ ప్రాంతంలో వంద ఎకరాలకు పైగా అతిపెద్ద స్థలంలో రోడ్ సిగ్నలింగ్ వ్యవస్థతో అత్యాధునిక డ్రైవింగ్ స్కూల్‌ను దశాబ్దాల క్రితమే ఏర్పాటు చేశారు. ఆసియాలోనే అతిపెద్ద ఆటోనగర్ ఏర్పాటు, ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఏర్పాటు, ఇలా ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్, ఆటోనగర్ పెద్దల కమిటీలో, ఇండస్ట్రియల్ లోకల్ అథారిటీ ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా పోటీ లేకుండా ఏకగ్రీవం చేసి నేతల మధ్య సామరస్యపూరిత ఎంపికలో ఆయన పాత్ర ప్రముఖమైంది. 1982లో ప్రారంభించిన నవత రోడ్ ట్రాన్సుపోర్టు నేడు దేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, పాండిచ్చేరి, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రలో దాదాపు 668 బ్రాంచిలుగా విస్తరిస్తూ దేశంలో మిగిలిన ప్రాంతాలకూ విస్తరించే ఏర్పాట్లు చేయడంలో ఆయన కృషి ఉంది. ఉమ్మడి కుటుంబ విలువలకు ప్రాధాన్యత ఇస్తూ కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వరిస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలిచిన ఆయన మరణం తీరనిలోటని బంధుమిత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయన పార్థివ దేహాన్ని బంధుమిత్రుల సందర్శనార్థం క్రీస్తురాజపురంలో స్వగృహంలో ఉంచారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు అంతిమయాత్ర మొదలవుతుందని బంధువులు తెలిపారు.

యమకింకర.. కంకర!

● కంకర కష్టాలు కడతేరేదెన్నడో
● హెవీ లోడ్లతో హైవేలపై జారుతున్న కంకర
● రోజుకు నాలుగైదు ట్రాక్టర్ల కంకరను తొలగిస్తున్న రోడ్డు భద్రతా సిబ్బంది

ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి: కంకరే కదా అని కొట్టిపారేయకండి. యమకింకర కంకర ఇది. ఈ కంకరే అనేక రోడ్డు ప్రమాదాలకు కారణమవుతోంది. కుటుంబాల్లో విషాదాలను నింపుతోంది. ఇంకొందరిని మంచానికే పరిమితం చేస్తుంది. రహదారులపై ఆదమరిచి వాహనాలు నడిపారా అంతే. కంకర కాస్త కింకరుడిలా మారడం ఖాయం. హైవేలపై కారుతున్న కంకరతో తస్మాత్ జాగ్రత్త. నిబంధనలు తుంగలో తొక్కి కనీసం పట్టాలు కట్టుకోకుండా అడ్డగోలుగా కంకర రవాణా చేస్తున్న టిప్పర్ల నుంచి కంకర (షిప్స్) రహదారులపై జారిపోతోంది. ముఖ్యంగా విజయవాడ - హైదరాబాద్ 65వ జాతీయ రహదారి, ఇబ్రహీంపట్నం - చత్తీస్‌గఢ్ జాతీయ రహదారిపై టిప్పర్లలో నుంచి కంకర గుట్టలు గుట్టలుగా పడిపోతుంది. జిల్లాలోని ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, జి.కొండూరు మండలాల్లోని వందలాది రాతి క్వారీల సమీపంలోని పెద్ద క్రషర్ల నుంచి రోజే వందల సంఖ్యలో టిప్పర్లు కంకరను ఉమ్మడి కృష్ణాజిల్లాల్లోని పలు గ్రామాలకు రవాణా చేస్తుంటాయి. ఈ క్రమంలో టిప్పర్లలో కంకరను ఓవర్‌లోడు చేస్తున్నారు. డ్రైవర్ క్యాబిన్‌పై కూడా కంకరను పోసి రవాణా చేస్తున్నారు. కనీసం పట్టాలు కూడా కట్టకుండా రవాణా చేస్తున్నారు. దీంతో హైవే-65, హైవే-30పై పలు కూడళ్ల వద్ద, జంక్షన్లు ఉన్న చోట పెద్ద ఎత్తున కంకర టిప్పర్ల నుంచి కింద జారుతోంది. పశ్చిమ ఇబ్రహీంపట్నం జంక్షన్, రింగ్ సెంటర్లలో ప్రతిరోజు 4 నుంచి 5 ట్రాక్టర్ల మేర కింద పడిపోయిన కంకరను రోడ్డు భద్రతా సిబ్బంది తొలగిస్తున్నారంటే కంకర ఎంతలా జారుతుందో అర్థం చేసుకోవచ్చు. పైగా టిప్పర్ యజమానులు, డ్రైవర్లు రాత్రి వేళల్లో నిబంధనలు మరింతగా విస్మరించి రవాణా చేయడంతో తెల్లవారేసరికి రహదారుల నిండా కంకరే. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధిక లోడుతో అడ్డగోలుగా కంకర రవాణా జరగకుండా ఉండాలంటే నిబంధనలు మరింత కఠినతరం చేయాలి. రాజకీయనేతల ఒత్తిడో లేక మరే కారణం చేతనో నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలకు అధికారులు పూనుకోవడం లేదు. వీరి తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భద్రత లేని కంకర, బండ రాళ్ల రవాణాపై చర్యలు తీసుకోవాలని, ప్రజలు ప్రాణాలకు రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు.



అధిక లోడుతో పట్టా లేకుండా వెళుతున్న వాహనం





పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద రహదారిపై పడిన కంకరను ట్రాక్టర్‌కు ఎత్తుతున్న రోడ్డు భద్రతా సిబ్బంది



యోగాతో జీవితమంతా ఆనందమయం: కలెక్టర్

సత్యనారాయణపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాను ఆరోగ్యజిల్లాగా తీర్చిదిద్దేందుకు చేయి చేయి కలుపుదామని, యోగా తోడైతే జీవితమంతా ఆనందమేనని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో ఆయూష్‌శాఖ, జిల్లా అధికారులు, పరిశ్రమలు, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యోగాంధ్రలో భాగంగా గురువారం విద్యార్థులు, పరిశ్రమల ప్రతినిధులు, యోగా ఔత్సాహికులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. దీంతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం చేకూరి ఉత్సాహంగా పని చేసేందుకు వీలు ఉంటుందన్నారు. రుగ్మతల నుంచి రక్షణ పొందేందుకు యోగాసనాలు ఆచరించడం ఉత్తమ మార్గమన్నారు. కాలుష్య నియంత్రణమండలి ఈఈ పి.శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, వన్‌ఎర్త్ వన్‌లైఫ్ ప్రతినిధులు ఏలూరి లీలాకుమారి, ఆయుష్ అధికారులు డాక్టర్ వీ రాణి, నర్సింగ్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీఐ కౌన్సెలింగ్‌లో 93 మందికి అడ్మిషన్లు

భారతీనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో మొదటి విడత అడ్మిషన్ల కొరకు గురువారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన మొదటిరోజు కౌన్సెలింగ్‌లో 187 మంది అభ్యర్థులను ఆహ్వానించగా 101 మంది హాజరవగా 93 మంది విద్యార్థులకు వివిధ ట్రేడ్లలో అడ్మిషన్లు కేటాయించినట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు.



రాజధాని రైతులకు ప్లాట్ల పత్రాలను అందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్ వసంత రాయుడు

రాజధాని రైతులకు ప్లాట్ల కేటాయింపు

కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన 15 గ్రామాలకు చెందిన 116 మంది రైతులకు గురువారం విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో ఈ-లాటరీ విధానంలో 294 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. వీటిలో 197 నివాస ప్లాట్లు కాగా 97 వాణిజ్య ప్లాట్లు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కృష్ణాయపాలెం, నవులూరు 1, 2, కురగల్లు 1, 2, నిడమర్రు 1, 2, పెనుమాక గ్రామ రైతులకు ఈ లాటరీ నిర్వహించగా, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తుళ్లూరు 1, 2, నెక్కల్లు, అనంతవరం, రాయపూడి 1, 2, కొండమరాజుపాలెం, శాఖమూరు, వెంకటపాలెం, వెలగపూడి, మందడం 1, 2, పిచ్చుకలపాలెం గ్రామ రైతులకు ఈ లాటరీ విధానంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ప్లాట్లను కేటాయించడం జరిగింది. లాటరీకి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రైల్ రన్‌వేసి తర్వాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను చేపట్టారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజినల్ సర్టిఫికెట్లు అందచేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజేషన్) ఎన్ఎస్‌వీబీ వసంతరాయుడు మాట్లాడుతూ ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించడానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ప్లాట్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఎలాంటి రుసుము వసూలు చేయబడదన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.భీమారావు, ఎం.శేషిరెడ్డి, ఏజీ చిన్నికృష్ణ, పి.పద్మావతి, జి.రవీందర్, కె.స్వర్ణమేరీ, బి.సాయిశ్రీనివాస్ నాయక్, కెఎస్ భాగ్యరేఖ, ఇతర అధికారులు, సీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ రోల్‌బాల్ క్రీడకు యువకుడి ఎంపిక

గుడ్లవల్లేరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కొండిపాలేనికి చెందిన యువకుడు మోటపర్తి శ్రీకాంత్ అంతర్జాతీయ రోల్‌బాల్ క్రీడకు ఆంధ్రా, తెలంగాణాల జట్టుకు ఎంపికయ్యాడని వారి కుటుంబసభ్యులు తెలిపారు. కొండిపాలేనికి చెందిన మోటపర్తి రాంబాబు, చైతన్యల కుమారుడు శ్రీకాంత్ అంతర్జాతీయ రోల్‌బాల్ క్రీడకు ఎంపికకావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది జనవరిలో కర్నూల్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో ఆడి ఉత్తమ ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ జట్టుకు ఎంపికయ్యాడని కుటుంబసభ్యులు తెలిపారు.


శ్రీకాంత్

హరితాంధ్ర కోసం ప్రతి ఒక్కరి కృషి తప్పనిసరి

● ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం


గుడివాడలో మొక్కలు నాటుతున్న ఆర్‌డీవో బాలసుబ్రహ్మణ్యం

గుడివాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : హరితాంధ్ర కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్‌డీవో కార్యాలయ ఆవరణలో గురువారం ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీటీలు బాలాజీ, సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు. శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో స్థానిక పాటిమీద గల శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ గోడౌన్ పక్కన గల స్థలంలో మండల వ్యవసాయాధికారి బి.అనంతలక్ష్మీ మొక్కలు నాటారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్, సభ్యులు పల్లపోతు వెంకటనాగబాబు, పాల్గొన్నారు.

నాగవరప్పాడులోని వాటర్ ట్యాంకు ప్రాంగణంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ మొక్కలు నాటారు అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : పర్యావరణ సమతుల్యత పాటించటానికి ప్రకృతిలో మొక్కలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్ అన్నారు. గురువారం బిళ్లపాడులో ఎంపీడీవో మండల స్థాయిలో మొక్కలను నాటారు. బొమ్ములూరులో డిప్యూటీ ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు మొక్కలను నాటారు. మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ బొమ్ములూరులో మొక్కలను నాటారు. బిళ్లపాడు కార్యదర్శి వి.హరికృష్ణ, బొమ్ములూరు కార్యదర్శి రామ్మోహనరావు, మల్లాయిపాలెం కార్యదర్శి పి.కోటయ్య, లింగవరం కార్యదర్శి అనూల, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కూచిపూడి : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కూచిపూడిలో ఎండీవో జె.విమాదేవి, సర్పంచ్ కొండవీటి విజయలక్ష్మిలు మొక్కలు నాటి పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వీరంకి తులసీదాస్, అమరబాలేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పుష్పనాథం పాల్గొన్నారు. కోసూరులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పెనుమూడి రమేష్, కార్యదర్శి ఎంఎస్.ఎన్.మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

నందివాడ: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని నందివాడ, జనార్ధనపురం, తమిరిశ, పొలుకొండ గ్రామాల్లో పంచాయతీ కార్యాయాల వద్ద హైస్కూల్‌లో మొక్కలు నాటుట కార్యక్రమం డిప్యూటీ ఎంపీడీవో అమిర్ మీర్జా బాష, ఉపాధి హామీ పథకం ఏపీవో దేవానంద్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పొలుకొండలో సర్పంచ్ ఝాన్సీ కుమారి మొక్కలు నాటారు.

పెదపారుపూడి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం వెంట్రప్రగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పెదపారుపూడి ఎంపీపీ గోగం సురేష్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం హాజరైన వారంతా పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్ (వంశీ), మమండల ముఖ్య నాయకులు చలసాని రమేష్ చౌదరి , గ్రామసర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి, మాజీ సర్పంచ్ రవికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరికిషోర్, పాల్గొన్నారు. మండల పరిషత్ ఎస్పీ బేగం, జేపీ స్వరూప్ కుమార్, టైపిస్ట్ ఏసుబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివనాగమణి, రంగారావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు, వడ్లమన్నాడు గ్రామపంచాయితీ ఆవరణల్లో మండల పరిషత్ కార్యాలయ ఏవో ఇమ్రాన్ మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ..

శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి, పర్యావరణాన్ని రక్షించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్లాస్టిక్ నివారణపై ర్యాలీ నిర్వహించి,మానవహారం చేశారు. గ్రామంలో రోడ్లవెంబడి ఉండే ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండ రామారావు తదితరులు పాల్గొన్నారు.


గుడ్లవల్లేరులో మానవహారంగా ఏర్పడిన ఇంజనీరింగ్ విద్యార్థులు

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

మచిలీపట్నం టౌన్ : ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి వెంటనే పరిష్కరించాలని జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి రాము అన్నారు. మచిలీపట్నం నుంచి చలో విజయవాడ కార్యక్రమం గురువారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వరప్రసాద్, సంయుక్త కార్యదర్శులు రామకృష్ణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

పనుల్లో జాప్యాన్ని సహించేది లేదు

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఒకటి,రెండు చోట్ల కాంట్రాక్టర్లు నిర్లక్ష్యాన్ని గుర్తించానని, మందకొడిగా పనులు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హెచ్చరించారు. గురువారం స్థానిక ప్రజావేదికలో ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులు, డీసీ ఛైర్మన్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో రైతాంగానికి మంచి చేసేందుకు అధికారులు, నీటి సంఘాలు కలిసి పనిచేయాలన్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు చేస్తుంటూ వారిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. సీజన్ ప్రారంభానికి ముందే కాలువలు, డ్రెయిన్‌ల్లో సమస్యల పరిష్కారానికి ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. కాలువల్లో తూడు, గుర్రపు డెక్కల తొలగింపునకు రూ.2.05కోట్లు నిధులు మంజూరు కావడం సంతోషకరమన్నారు. వర్షాలు కురిసేలోపు ఇరిగేషన్, డ్రెయినేజీ కాలువల్లో చెత్త, డెక్క, తూడులను తొలగించేలా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల పేర్కొన్నారు. నీటిసంఘాల ఛైర్మన్‌లు తీసుకొచ్చిన సమస్యలను ప్రస్తావించి వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ డీఈ సూర్యభరత్, డ్రెయినేజీ డీఈ గణపతి, డీసీ ఛైర్మన్లు యార్లగడ్డ రవి, బొమ్మనబోయిన ఏసుబాబు, ఆంజనేయులు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

ప్రజల ఆరోగ్య భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

తోట్లవల్లూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : విద్య, వైద్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. తోట్లవల్లూరు పీహెచ్‌సీ ఆవరణలో ఎన్‌హెచ్‌ఎం 15వ ఆర్థిక సంఘం హెల్త్‌గ్రేడ్ నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే కుమార్ రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకుస్థాపన చేసిన ఏడాదిలోపే పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని పూర్తిచేసి, ప్రారంభించటం ప్రజల ఆరోగ్యం పట్ల కూటమి ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. దీనిలో ఏర్పాటు చేసే ల్యాబ్‌లో అన్ని పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే వైసీపీ ప్రభుత్వం వదిలేసిన గుంతల రోడ్లను అభివృద్ధి చేశామని, రైతుల సంక్షేమానికి కృషి జరుగుతోందన్నారు. దీపం పథకం కింద మూడు సిలిండర్‌లు అందిస్తున్నామని, జూన్‌లో తల్లికి వందనం కింద రూ. 15 వేలు జమచేయబోతున్నామని వివరించారు. అనంతరం ఆస్పత్రిలో వార్డుల్లోకి వచ్చి రోగులకు అందుతున్న సేవలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. వార్డులో చిన్న పిల్లలను ఎత్తుకుని తల్లులతో మాట్లాడారు. వైద్యులు మంచి సేవలందిస్తున్నారని తల్లులు ఎమ్మెల్యేకు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ టి. సాయి ప్రసన్న, టీడీపీ నాయకులు నెక్కలపూడి మురళీ, చింతపల్లి వెంకటేశ్వరరావు, గొరిపర్తి గోపయ్య, రాంబాబు, తటుకూరి రమణ, తోట సాయిబాబు పాల్గొన్నారు.


హెల్త్ యూనిట్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా


నాగేశ్వరమ్మకు నగదు అందజేస్తున్న వీఆర్వో శ్రీనివాసరావు

గ్రామ రెవెన్యూ సహాయకుడి మృతి

నందివాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గత 45 సంవత్సరాలుగా రెవెన్యూ సమాయకుడిగా (వీఆర్‌ఏ)గా పొలుకొండ గ్రామ సహాయకుడు బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు (పండు) పని చేసిన అనారోగ్య కారణంగా బుధవారం తన స్వగృహంలో తుదిశ్వాస విడిచినట్లు కుమారుడు ఏసుబాబు తెలిపారు. మట్టి ఖర్చులకు ప్రభుత్వం నుంచి రూ.25000 వీఆర్వో శ్రీనివాసరావు భార్య నాగేశ్వరమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఎంపీటీసీ ఉప్పల వెంకటేశ్వరరావు, మండల డీసీ ఛైర్మన్ బొమ్మనబోయిన ఏసుబాబు, శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.

వెంకయ్య కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

పామర్రు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి అంకితభావంతో పని చేసిన వ్యక్తి అనారోగ్యంతో మరణించడం చాలా బాధకరమని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. టీడీపీ సీనియర్ నేత, పామర్రు గ్రామ పంచాయతీ 17వార్డు సభ్యుడు పామర్తి వెంకయ్యనాయుడు(వెంకయ్య) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం వెంకయ్య నాయుడు దశ కర్మకార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వెంకయ్య చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, తనప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంకయ్య కుటుంబానికి పార్టీ అన్నివిధాలుగా అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చాట్ల రమేష్, వీరంకి వెంకటేశ్వరరావు, మంతెన రామంజనేయులు, మూడే శివశంకర్, నూకవరపు కిరణ్ టీడీపీ నేతలు పాల్గొన్నారు.


లీకైన పైపులైన్లు చూపిస్తున్న కార్యదర్శి కృష్ణవేణి

పైపు లీకులకు మరమ్మతులు

పెదపారుపూడి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ట్యాపుల ద్వారా కలుషిత నీరు వస్తున్నట్టు ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పెదపారుపూడి ఇంచార్జ్ కార్యదర్శి కృష్ణవేణి వెంటనే పైపులు లీకేజీలను బాగు చేయించి గ్రామ ప్రజలకు మంచినీరు అందించామని కార్యదర్శి తెలిపారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు ఏమైనా ఉంటే తమ వద్దకు వచ్చి సమస్యలు తెలిపిన వెంటనే సమస్యను పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

రైతుల ప్రయోజనాలే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కూచిపూడి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మొవ్వ ఏఎంసీ ఛైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం కూచిపూడి ఏఎంసీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఛైర్మన్‌గా దోనేపూడి శివరామయ్య, వైస్ ఛైర్మన్‌గా సనకా కిరణ్‌తోపాటు పలువురు పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ఎంపికైన పాలకవర్గం రైతుల ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రైతుల ప్రయోజనాల కోసం పాటుపడతా : ఛైర్మన్

ఏఎంసీ ఛైర్మన్‌గా నియమితులైన దోనేపూడి శివరామయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల కోసం కృషి చేస్తూ ఎల్లవేళలా వారికి అందుబాటులో ఉంటానని తెలిపారు. తనను నియమించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, నన్నపనేని వీరేంద్ర, తాడిశెట్టి నరేష్, వీరంకి తులసీదాస్, ఘంటసాల ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, వైస్ ఛైర్మన్ అత్తలూరి గోపిచంద్, సర్పంచ్ రవి ప్రసాద్, సుబ్బారావు, బుజ్జి, గాంధీ, కిరణ్, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న దోనేపూడి శివరామయ్య

నూతన వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు

● కేవీకే సమన్వయకర్త డి.సుధారాణి


సమావేశంలో మాట్లాడుతున్న సుధారాణి

పమిడిముక్కల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : నూతన వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా నోడల్ అధికారి, కేవీకే సమన్వ యకర్త డి.సుధారాణి అన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కపిలేశ్వరపురం రైతు సేవా కేంద్రంలో గురువారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుత కాలంలో అధిక మోతాదులో రసాయన మందులు వాడకం వల్ల నేల కలుషితం అవుతుందని, అవశేష రహిత పంట ఉత్పత్తులు పొందాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను ఏవో గణేశ్‌రెడ్డి తెలియజేశారు. ఎరువుల యాజమాన్యం, కలుపు యాజమాన్యం, సస్యరక్షణ చర్యలపై రైతులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. యాంత్రీకరణలో భాగంగా డ్రోన్ ఆవశ్యకత తెలియజేస్తూ రైతులకు అవగాహన కల్పించారు. ఉప సర్పంచ్ శివరామకృష్ణ, శాస్త్రవేత్తలు అనిత, రేవతి, పద్మావతి పాల్గొన్నారు.

పని గంటలను పెంచడం దారుణం

● ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పని గంటలను 8 నుంచి 10గంటలకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం దారుణమని, నిర్బంధంగా ఓటీని అమల్చేయాలని ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో అనేక పోరాటాలో చేసి 8గంటల పని సమయాన్ని సాధించుకున్నామన్నారు. రాత్రి డ్యూటీలో మహిళలు షిఫ్ట్‌లో పనిచేయడానికి కూడా అనుమతిస్తూ తీసుకున్న నిర్ణయం దారుణమన్నారు. దీనిని కార్మిక సంఘాలుగా తామంతా వ్యతిరేకిస్తున్నామన్నారు. మహిళలు పనిచేసే చోట సీసీ కెమెరాలను పెట్టి, భద్రత పెంచాలని, మహిళలకు కావలసిన వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విశ్రాంతఉద్యోగి వరప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నేత ఆర్‌సీపీ రెడ్డి

కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

● టి.ఎన్ రాజశేఖర్


సర్టిఫికెట్‌లను అందజేస్తున్న రోటరీ క్లబ్ గుడివాడ అధ్యక్షుడు రాజశేఖర్

గుడివాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ అధ్యక్షుడు టి.ఎన్ రాజశేఖర్ అన్నారు. గురువారం స్థానిక రాజేంద్రనగర్‌లోని జి.వి పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్‌లో రోటరీ క్లబ్, బీడీపీఎస్ కంప్యూటర్స్ శిక్షణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నెలరోజులపాటు నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ ముగింపు సందర్భంగా 30మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. క్లబ్ కౌన్సిలర్ జి.శ్రీకర్‌బాబు, క్లబ్ కార్యదర్శి జి.కిరణ్‌బాబు, యూత్ సర్వీస్ డైరెక్టర్ వై.రెడ్డయ్యచౌదరి, కె.వెంకటేశ్వరరావు,రామకృష్ణ, శంకరరావు, పాల్గొన్నారు.

విద్యుత్‌కు అంతరాయం

గుడ్లవల్లేరు, 5 (ఆంధ్రజ్యోతి) : కౌతవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గుడ్లవల్లేరు, చంద్రాల గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని గుడివాడ డివిజన్ ఎలక్ట్రికల్ ఎడ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.బి.శ్రీనివాసరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. విద్యుత్ లేన్ల సమీపంలో విద్యుత్ తీగలకు తగులాడుతున్న చెట్టు కొమ్మలను తొలగించేందుకు ఈ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు దీనిని గమనించి తమతో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వడ్రంగి మేస్త్రీ షరీఫ్ బేగ్ మృతి

గుడివాడ రూరల్ : ది ఆటోనగర్ ఇండస్ట్రీయల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ సభ్యుడు వడ్రంగి మేస్త్రీ షరీఫ్ బేగ్(70) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఆటోనగర్ స్థాపించిన నాటి నుంచి షరీఫ్ బేగ్ ఇక్కడే పనిచేస్తున్నారని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల యూనియన్ నాయకులు అబ్దుల్ ఖుద్దూస్, అబ్దుల్ హమీద్, టి.లక్ష్మణరావు, రషీద్ బేగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి

పామర్రు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య జాగ్రత్తల పట్ల చిన్నతనం నుంచే అవగాహన పెంపొందించుకోవాలని గ్రంథాలయాధికారి ఎం.ఝాన్సీరాణి అన్నారు. గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా చిన్నారులకు పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ కాలుష్యం వల్ల కలిగే అనర్థాలను ఆమె వివరించారు. దీంతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్, పుస్తకపఠనంపై తరగతులు నిర్వహించారు. ఇదే విధంగా జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.నాగసురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: చౌటపల్లిలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల సందర్భంగా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. గ్రంథాలయ అధికారి రత్నదాస్ ఆధ్వర్యంలో పిల్లలకు పెయింటింగ్ తదితర పోటీలు నిర్వమించారు. ఈ కార్యక్రమంలో చౌటపల్లి గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయిబాబాకు అభిషేకం

గుడివాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ద్వారకా సాయి సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థాన ప్రాంగణంలో సత్యసాయిబాబా పంచలోహ విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. తొలుత బందరు నుంచి తీసుకొచ్చిన పంచలోహ శివలింగానికి అభిషేకం, మహాశిత లింగ అష్టోత్తర నామావళి, శివలింగ అభిషేకములు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు సీతారామస్వామి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి నారాయణమూర్తి, కన్వీనర్ వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

బందరు నుంచి చలో విజయవాడకు ప్రభుత్వోద్యోగులు



మచిలీపట్నం టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి వెంటనే పరిష్కరించాలని జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.రాము అన్నారు. మచిలీపట్నం నుంచి చలో విజయవాడ కార్యక్రమానికి తరలివెళ్లారు. రాము మాట్లాడుతూ, ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏ బకాయిలను వెంటనే ప్రకటించాలన్నారు. పీఎఫ్ రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి తోట వరప్రసాద్, సంయుక్త కార్యదర్శులు రామకృష్ణ, ప్రవీణ్, కోశాధికారి సురేష్‌నాయక్, అబ్దుల్ సమ్మద్ పాల్గొన్నారు.





బీచ్ ఫెస్టివల్, శాప్, బాల్‌బ్యాడ్మింటన్ పతాకాలను ఆవిష్కరిస్తున్న మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ



పిల్లలతో బీచ్ ఫెస్టివల్‌కు విచ్చేస్తున్న పర్యాటకులు

మట్టి ట్రాక్టర్ల సీజ్

మోపిదేవి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మేళ్లమర్రు వద్ద అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ ఎం.శ్రీవిద్య ఆదేశాల మేరకు వీఆర్వో ఎం.ప్రశాంత్ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు





బీచ్ ఫెస్టివల్‌లో గాంధీ వేషధారి, స్టాల్స్‌ను, కళాత్మక ఆకృతులను తిలకిస్తున్న పర్యాటకులు

బీచ్ ఫెస్టివల్‌లో కేరింతలు

మచిలీపట్నం టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మసులా బీచ్ ఫెస్టివల్‌ను మంత్రులు కొల్లు రవీంద్ర, దుర్గేష్ గురువారం సాయంత్రం అహ్లాదకరమైన వాతావరణంలో ప్రారంభించారు. జ్యోతి వెలిగించి ఫెస్టివల్‌ను ప్రారంభించిన అనంతరం బీచ్ ఫెస్టివల్, శాప్, క్రీడా పతాకాలను మంత్రులు కొల్లు రవీంద్ర, దుర్గేష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యేలు వర్లకుమార్ రాజా, కాగిత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు ఆవిష్కరించారు. బీచ్ ఫెస్టివల్‌కు ముందుగానే వచ్చిన పర్యాటకులు సముద్రంలో స్నానాలాచరిస్తూ కేరింతలు కొట్టారు. బీచ్ ఫెస్టివల్ సందర్భంగా ఏర్పాటు చేసిన కళాత్మక అంశాలను పర్యాటకులను ఆసక్తిగా తిలకించారు. కబడ్డీ పోటీలు అలసరించాయి. కూచిపూడి నాట్యప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమం లో జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కానూరులో మొక్క నాటుతున్న గోపు సత్యనారాయణ, నందమూరులో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కాగిత, నడకుదురులో మొక్కనాటుతున్న నాగఫణి శర్మ, మొక్కనాటి ఐ లవ్ దివిసీమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మచిలీపట్నం టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ అన్నారు. బందరు మండలం కానూరు గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని గోపు సత్యనారాయణ ప్రారంభించారు. దివి మహేష్, గోపు వెంకట రమణ, కొక్కిలిగడ్డ ప్రభుదాస్, ఆముదాలపల్లి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **పెడన రూరల్ :** మొక్కలు తల్లితో సమానం. అమ్మ ప్రాణం పోస్తే, మొక్కలు ప్రాణవాయువు అందించి కాపాడతాయని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నందమూరు గ్రామంలో టీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ మొక్కలు నాటారు. ఎంపీటీసీన సభ్యుడు బడే గంగాధర్‌రావు, తిమ్మన నాంచారమ్మ, సచివాలయ ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. **నాగాయలంక :** జడ్పీ పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఉపాధి పథకం ఏపీవో టివిఎన్.ముత్యాలు మాట్లాడుతూ, మండలంలో 800 వివిధ రకాల మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. సర్పంచ్ కైతేపల్లి అంకాలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.సత్యనారాయణ, బడుగు వెంకన్న తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** అశ్వారావుపాలెం, పులిగడ్డ గ్రామాల్లో వన మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అశ్వారావుపాలెం సర్పంచ్ పంద్రాజు లంకమ్మ



శ్రీకాకుళంలో..



అవనిగడ్డలో..



కోడూరులో..



అశ్వారావుపాలెంలో..

మొక్కలను నాటారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, పరసా రాంబాబు, పరసా నరసింహారావు, నాగబాబు, ఎంపీడీవో అరుణకుమారి, వెంకటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **పెడన :** గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలో బీజేపీ నేత సోము వీర్రాజు గురువారం మొక్కలు నాటారు. గ్రామంలో పునర్నిర్మించిన హేమకోదండ రామాలయాన్ని ఆయన ప్రారంభించారు. పెడన పట్టణంలోని పైడమ్మ తల్లి దేవస్థానం ఆవరణలో మొక్కలు నాటారు. బీజేపీ నాయకులు పుప్పాల రామాంజనేయులు, తుంగల మురళి, కోలపల్లి రజనీకుమార్, ఏసురాజు, మామిడి లక్ష్మీనారాయణ గుప్తా, కొల్లూరి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.**గూడూరు :** గూడూరులోసర్పంచ్ లింగం సులోచనారాణి విజయకుమార్ మొక్కలు నాటారు. రామరాజుపాలెంలో ఎంపీపీ సంగా మధుసూధనరావు మొక్కలు నాటారు. టి. శివరామప్రసాద్, వార్డు సభ్యులు కొత్తగుండు నాగలక్ష్మి, అమరారపు సుబ్బారావు, ఎన్‌ఆర్‌ఇజిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.**కోడూరు :** పలు ప్రాంతాలలో గ్రామ సర్పంచ్ వెన్నా షైనీ, పంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు, జడ్పీ ప్రసాద్, ఉపసర్పంచ్ యక్కటి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి జాహ్నవి మొక్కలను నాటారు. తుంగల వెంకటేశ్వరరావు, ఉపాధి పథకం సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. పులిగడ్డ గ్రామంలో సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, కార్యదర్శి అనితలు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో వార్డుసభ్యురాలు మండలి విజయలక్ష్మి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ భార్గవ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహం ఆవరణలో ఎంపీపీ తుంగల సుమతిదేవి, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావులతో కలసి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ మొక్కలు నాటారు. అవనిగడ్డలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం ఆవరణలో రెడ్‌క్రాస్ చైర్మన్ గుడివాక శేషబాబు నేతృత్వంలో మొక్కలు నాటారు. వంగర శేషగిరిరావు, గరికపాటి హరి ప్రసాద్, అల్లంశెట్టి వెంకటేశ్వరరావు, హరిబాబు, తుంగల వెంకటగిరి, ఆది రామ్మోహనరావు, బి.కృష్ణారావు, కోడూరు శ్రీనివాసరావు, ప్రసాద్, భోగాది సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** స్వచ్ఛ చల్లపల్లి ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ పార్కులో పైలాన్ ఎదురుగా ఇరువైపులా, పార్కు ఆవరణలో మొత్తంగా 95 మొక్కలను నాటారు. మండలపరిషత్ ఆవరణలో ఎంపీపీ కోట విజయరాధిక, ఇన్‌చార్జి ఎంపీడీవో వి.రవిశంకర్, పంచాయతీ ఆవరణలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవో మాధవేంద్రరావు, మంగళాపురంలో సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, కార్యదర్శి పివి. మాధవేంద్రరావులు మొక్కలు నాటారు. నారాయణరావునగర్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు చుట్టూ మొక్కలు నాటారు. నడకుదురు పాటలీవనంలో పద్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ, ఆలయ అభివృద్ధి దాత మండవ రవీంద్ర, ఈవో యార్లగడ్డ శ్రీనివాసులు మొక్కలు నాటారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. **బంటుమిల్లి :** వెంకటరమణ ట్రేడర్స్ అధినేత జూలూరి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో బంటుమిల్లిలో పలు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టారు. **ఘంటసాల :** శ్రీకాకుళం గ్రామంలో ఎంపీడీవో డి.సుబ్బారావు మొక్కలు నాటారు. సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఆత్కూరి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఆయా గ్రామాల సర్పంచ్‌లు మొక్కలు నాటారు. డిప్యూటీ ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా పులిగడ్డ ఆక్విడెక్ట్ అభివృద్ధి

మోపిదేవి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ ఆక్విడెక్ట్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మోపిదేవి వార్పు వద్ద 'ఐ లవ్ దివిసీమ' నూతన బోర్డులను, ఉద్యాన వనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలి యుగంధర్ ఆర్థిక సహకారం రూ.40 వేలతో ఉద్యానవనంలో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, పీసీ చైర్మన్ దేవన బోయిన వెంకటేశ్వరరావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, ఇరిగేషన్ శాఖ డీఈఈ ఎస్.అరుంధతి, ఏఈఈలు పొన్నూరు రవితేజ, దోవారి విజయ్ కుమార్, తానేటి ప్రసాద్, మొక్కల దాత మండలి యుగంధర్, కూటమి నాయకులు బండే రాఘవ, మండలి శేషు, మండలి శివప్రసాద్, మండలి సుధీర్, చెన్ను గాంధీ, నాగిడి రాంబాబు, మండలి రామకోటి, ఇరిగేషన్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ



బంటుమిల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి సలహాలు సూచనలు అందించాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ముంజులూరు గ్రామంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పంపిణీ చేశారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో మొక్కలు నాటారు, ప్రతివ్యక్తి ఒక మొక్క నాటాలని సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, సర్పంచ్ శ్రీనివాసరావు, డీసీ చైర్మన్ కాశీ, భూపతి రమేష్, వ్యవసాయశాఖ ఏవో శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజయక్రాంతి విద్యార్థినులకు ప్రతిభా అవార్డులు



చల్లపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విజయక్రాంతి విద్యార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. కళాశాల సీఈసీ విద్యార్థినిలు మట్టా శ్రీవల్లి, పొట్లూరి త్రివేణి, కాగిత భార్గవిలను ఇంటర్మీడియట్ బోర్డు ప్రతిభా అవార్డులకు ఎంపికచేయటం గర్వకారణమని కరస్పాండెంట్ దుట్టా శివరామప్రసాద్ తెలిపారు. ఈనెల 9వ తేదీన జరిగే కార్యక్రమంలో విద్యార్థినిలు అవార్డులు అందుకుంటారన్నారు. విద్యార్థినిలకు మదర్ థెరిస్సా, స్వామి వివేకానంద చిత్రపటాలను అందించి అభినందించారు.

పని గంటల పెంపుపై నిరసన



చల్లపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : హక్కుల కాలరాస్తూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేస్తోందని మండల సీఐటీయూ కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా విమర్శించారు. కార్మికుల పని గంటలను 10 గంటలకు పెంచుతూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించటాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీ యూ ఆధ్వర్యంలో కార్మికులు చల్లపల్లి పంచాయతీ ఎదుట గురువారం నిరసన తెలిపారు. మండల కమిటీ సభ్యులు కె.రాజేశ్వరరావు, పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నేలకు అనువైన వరి రకాలు సాగు చేయాలి



కోడూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : నేలకు అనువైన వరి వంగడాలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఘంటసాల వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త వి.సత్యప్రియ లలిత తెలిపారు. వి.కొత్తపాలెం గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఘంటసాల కేవీకే మత్స్యశాస్త్రవేత్త యశ్వంత్ కుమార్ పంటల సాగు, కేవీకి అందించే సేవలను వివరించారు. పథకాలు, భూసార పరీక్షల ప్రాముఖ్యత, సేంద్రియ వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ, కౌలు రైతులకు కార్డుల ఉపయోగాలు వివరించారు. డాక్టర్ సుబ్బన్న, జె.జయప్రద, శ్రీధర్, విఏఏ ఉదయ్ కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కృష్ణా మిల్క్ యూనియన్ ధ్యేయం

ఘంటసాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సంక్షేమమే కృష్ణా మిల్క్ యూనియన్ ధ్యేయమని యూనియన్ పాలకవర్గ సభ్యులు వేమూరి సాయి వెంకటరమణ పేర్కొన్నారు. ఘంటసాలకు చెందిన పశుపోషకులు కొల్లూరి శ్రీనివాసరావు కుమారుడు హికిలేష్ వివాహం సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ అమలు చేస్తున్న కల్యాణ మస్తు పథకం కింద రూ.20 వేల విలువ గల బంగారు నాణేన్ని గురువారం అందజేశారు. ఘంటసాల సంఘ అధ్యక్షులు గొర్రెపాటి సురేష్, క్లస్టర్ మేనేజర్ గోపినాథ్, సూపర్‌వైజర్ తమ్మన సురేష్ పాల్గొన్నారు.

తైక్వాండో ప్రతిభావంతులకు సీఐ అభినందన



చల్లపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : తైక్వాండో జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన చల్లపల్లి విద్యార్థులను చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు అభినందించారు. ఎవన్ జిమ్ సెంటర్ విద్యార్థులు వై.అఖిల్, ఎ.హేమ రాజు, ఎ.కార్తికేయ, సాత్విక్, ఎం.బాలాజీ గోల్డ్‌మెడల్ సాధించగా, సహస్ర, మణికంఠ సిల్వర్ మెడల్స్, సిద్ధార్థ్ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు కోచ్ కందుల పవన్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులకు సీఐ ఈశ్వరరావు అభినందనలు తెలిపారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు 9, 10, 11 తేదీల్లో తాడిపత్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ చెప్పారు.